



Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 350 | గురువారం 09 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda,




## బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకలపై విచారణ వేగవంతం

# ఓ సిబ్బందిపై వేటు

హైదరాబాద్ - సూర్య వాస్తవం:

బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకలపై శ్రీ బద్రీనాథ్ -- కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దర్యాప్తు కమిటీ విచారణను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలోనే శ్రీ బద్రీనాథ్ -- కేదార్‌నాథ్ టెంపులు కమిటీ ఓ సిబ్బందిపై వేటు వేసింది. విరాళాలు చోరీ చేశాడన్న - మిగతా 2లో..



## జోరువానలోనూ కొనసాగిన సీజేపీ ఆందోళన

- షాహిదే ఆజం భగత్ సింగ్ స్కిట్ ప్రదర్శన

2లో



## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్

- రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్
- పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఫ్రీజ్
- కేర్‌వెల్ ఏవియేషన్ గ్రూప్‌తో లావాదేవీలపై దర్యాప్తు
- పార్టీ నిధులతో విమానం, హెలికాప్టర్ కొని లీజుకు తీసుకున్నట్లు ఆరోపణలు


2లో

# ఆస్ట్రేలియాలో ప్రధానికి ఘన స్వాగతం..

## 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన మెల్‌బోర్న్

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) - సూర్య వాస్తవం:

మూడు దేశాల పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోదీ ఇవాళ (బుధవారం) ఆస్ట్రేలియా చేరుకున్నారు. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మెల్‌బోర్న్ చేరుకున్న ప్రధానికి విమానాశ్రయంలో అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం లభించింది. ఆస్ట్రేలియాలోని భారత సంతతి ప్రజలు, ప్రవాస భారతీయులు ప్రధాని మోదీకి అపూర్వ స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై', 'మోదీ.. మోదీ' నినాదాలతో విమానాశ్రయ పరిసరాలు హోరెత్తాయి. 'ఆస్ట్రేలియన్ ఇండియన్ ఆర్కెస్ట్రా' అందించిన వందేమాతరం ఆలాపన ఈ స్వాగత వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండోనేషియా పర్యటన ముగించుకుని ఆస్ట్రేలియా వచ్చిన ప్రధాని మోదీ, ఈ పర్యటన అనంతరం న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు.



### సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి సరికొత్త ఊపు

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో జరగబోయే ద్వైపాక్షిక చర్చలు ఇరు దేశాల 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేస్తాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం '**ఎక్స్**' లో స్పందిస్తూ... 'ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో చర్చల - మిగతా 2లో..

# నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

## - ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ - మిగతా 2లో..





## బెంగళూరుకు ఆవల మరిన్ని

# కొత్త బెంగళూరుల నిర్మాణం

## - సీఎం డి.కె. శివకుమార్ ప్రకటన

బెంగళూరు- సూర్య వాస్తవం :

మా ప్రభుత్వం బెంగళూరుకు ఆవల మరిన్ని బెంగళూరులను నిర్మించాలని యోచిస్తోంది. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కూడా బెంగళూరులో అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము, అని సీఎం డీకే శివకుమార్ అన్నారు. బుధవారం మన్యతా టెక్ పార్క్‌లో జరిగిన 'టార్గెట్ ఇండియా' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బెంగళూరులో కార్యాలయ స్థలానికి అద్దె 1 నుంచి 1.5 డాలర్లుగా - మిగతా 2లో..

# పేద విద్యార్థులకు అండ

- రెండో త్రైమాసికం నుంచే అమలు
- నిధులు లేవు, వచ్చే ఏడాది ఇద్దామన్నా ఒప్పుకోని సీఎం.. ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ
- హాస్టళ్లు కాదు.. ఇక గురుకులాలనే నిర్మిద్దాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లోని మెరిట్ విద్యార్థులకు శిక్షణా కేంద్రాలు
- రూ.100 కోట్లతో హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు మరమ్మతులు
- సంక్షేమశాఖలపై చంద్రబాబు సమీక్ష



అమరావతి, - సూర్య వాస్తవం :

ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు చెల్లించే డైట్ చార్జీలను 10 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో సంక్షేమ శాఖలపై సమీక్షిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం ప్రకటించారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులున్నాయని... వచ్చే ఏడాది నుంచి పెంచుదామని ఆర్థికశాఖ అధికారులు సూచించగా, లేదు.. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ చార్జీలను పెంచాలని సీఎం స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుందని, దీనికి తగినట్లుగానే వారికి అన్ని రకాల అవకాశాలు అందాలన్నారు. మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలతో పాటు పోషకాహారాన్నీ అందించాల్సిన అవసరముందన్నారు. సంక్షేమ శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, దీనికోసం పెద్దఎత్తున గురుకులాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. "హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం చేపట్టేందుకు పెద్దపీట వేయాలి. రెసిడెన్షియల్ స్కూళ్లలో నెట్ జీరో విధానాన్ని అమలుచేయడం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో విశ్లేషించాలి. బయోడైవర్సిటీ - మిగతా 2లో..

## కెనడా పెట్టుబడులకు

# తెలంగాణే కేరాఫ్ అడ్రస్

- సీఎం రేవంత్ రెడ్డి.
- మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యం కావాలి
- హైదరాబాద్‌లో కెనడా మల్టీ-యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయండి
- డిసెంబర్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రావాలని కెనడా ప్రతినిధులకు సీఎం పిలుపు



హైదరాబాద్ - సూర్య వాస్తవం

తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా, సాంకేతికంగా అంతర్జాతీయ స్థాయిలో దూసుకు పోతోందని, కెనడా పెట్టుబడులకు మన రాష్ట్రమే అత్యంత అనుకూలమైన వేదిక అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో కెనడా హై కమిషనర్ క్రిస్ కూటర్ గారితో జరిగిన భేటీలో ముఖ్యమంత్రి తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని, రాబోయే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సుదీర్ఘంగా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ....మా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కేవలం నదిని శుభ్రం చేసే పర్యావరణ - మిగతా 2లో..

# వైఎస్సార్‌కు మరణం లేదు: షర్మిల

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన షర్మిల
- వైఎస్ అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు అందాయని ప్రశంస
- ఆయన మరణం తట్టుకోలేక 700 మంది ఆయనతో పాటే వెళ్లిపోయారని వ్యాఖ్య

అమరావతి- సూర్య వాస్తవం



తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'వైఎస్సార్ లెజెండరీ లీడర్. ఆయనకు మరణం లేదు' అని షర్మిల అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కేవలం 5 ఏళ్లు - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఆస్ట్రేలియాలో ప్రధానికి ఘన స్వాగతం..

(మొదటి పేజీ తరువాయి)

కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇరు దేశాల బంధానికి బలమైన స్తంభాలుగా నిలుస్తున్న ప్రవాస భారతీయులతో ముచ్చటించే అవకాశం కూడా ఈ పర్యటనలో నాకు లభించనుంది.' అన్నారు. ఈ ఉన్నత స్థాయి భేటీలో ఇరు దేశాల ప్రధానమంత్రులు రక్షణ-భద్రత, వ్యాపారం-పెట్టుబడులు, విద్య, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలతో పాటు అభివృద్ధి చెందుతున్న కీలక సాంకేతికతలు, క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్ రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

# నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

(మొదటి పేజీ తరువాయి)

పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్, హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్(హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

## బద్రీనాథ్ ఆలయ విరాళాలు..

# ఓ సిబ్బందిపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణల కారణంగా అతడిని విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై బీకేటీసీ చైర్మన్ హేమంత్ ద్వివేది స్పందిస్తూ.. 'ప్రైవేట్ సెక్రటరీగా పని చేసే ప్రమోద్ నౌతి యాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశాం. ప్రాథమిక దర్యాప్తులో విరాళాల విషయంలో అతడు అవకత వకలకు పాల్పడినట్లు తెలిసింది' అని పేర్కొన్నారు. ఇక, సస్పెండ్ అయిన ప్రమోద్ నౌతియాల్‌పై మంగళవారం రాత్రి బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదైంది. బద్రీనాథ్ ఆలయ విరాళాలు, కానుకల లెక్కింపులో జరిగిన అక్రమా లపై సమగ్ర విచారణ జరిపి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు.

## జోరువానలోనూ

# కొనసాగిన సీజేపీ ఆందోళన

### - షాహిద్-ఎ-ఆజం భగత్ సింగ్ స్కిట్ ప్రదర్శన

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

నీట్ పరీక్ష పత్రం లీక్, సీబీఎస్ఈ అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఉద్యమం బుధవారం ఉదయం నుంచి జోరు వర్షంలో కొనసాగింది. జంతర్ మంతర్ వద్ద జూన్ 20న ప్రారంభమైన సీజేపీ ఆందోళన 19 రోజులు పూర్తి చేసుకుంది. అలాగే వాంగ్‌చుక్‌తో పాటు విద్యార్థులు చేపట్టిన నిరాహార దీక్ష 11 రోజులు పూర్తి చేసుకుంది. వందలాది మంది విద్యార్థులు, యువత జోరువర్షంలో కూడా తమ ఆందోళనను కొనసాగించారు. మరోవైపు సాయంత్రం వర్షం తగ్గిన తరువాత ఆందోళన వేదిక వద్ద షాహిద్-ఎ-ఆజం భగత్ సింగ్ స్కిట్‌ను యువత ప్రదర్శించారు.

వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించినప్పటి నుంచి ఏడు కేజీలకు పైగా బరువు తగ్గారు. ప్రస్తుతం ఆయన బరువు 59.40 కిలోలుగా ఉంది. సుదీర్ఘ దీక్ష తరువాత కూడా వాంగ్‌చుక్ మానసికంగా చురుకుగా ఉన్నారని వైద్యులు తెలిపారు. కూర్చున్నప్పుడు అతని రక్తపోటు 103/68గా, పడుకున్నప్పుడు 111/73గా నమోదైంది. ఆయన నాడి నిమిషానికి 74 సార్లు, రక్తంలో గ్లూకోజ్ 75, ఆక్సిజన్ సంతృప్తత 98 శాతంగా నమోదు అయింది. ఆయన బరువు నిరంతరం తగ్గడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనలను పెంచినప్పటికీ, ఆయన శరీరంలో నీటి శాతం బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

# వైఎస్సార్‌కు మరణం లేదు: షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే పని చేసినా... ఆయన చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గడపకు అందాయని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలను వైఎస్సార్ మనసు పెట్టి అమలు చేశారని తెలిపారు. ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆ సమయంలో 700 మంది ఆయన వెంటే వెళ్లిపోయారని అన్నారు.

# పేద విద్యార్థులకు అండ

(మొదటి పేజీ తరువాయి)

పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించాలి. అక్కడ మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలి. అన్నీ రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లకు మెయింటినెన్స్ గ్రాంట్ ఇవ్వాలి. దీనికోసం రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం. హాస్టళ్లు, గురుకులాల్లో చదివే విద్యార్థులను ఉన్నతవిద్య, పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇప్పించాలి. విద్యతో సమానంగా శిక్షణ ఉండాలి.

ఉత్తమ ఉపాధ్యాయులను నియమించి, నాణ్యమైన శిక్షణ ఇప్పించాలి. హాస్టళ్లు, గురుకులాల్లో ప్రతిభ కనబరిచే ఇంటర్ విద్యార్థులకోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయాలి. ఈ మేరకు పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలి. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను మ్యాపింగ్ చేసి, నైపుణ్యం పెంచి పారిశ్రామిక అవసరాలకు తగినట్టు తయారుచేయాలి. హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేలా వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలి. సంక్షేమ హాస్టళ్లను ఎన్ఆర్ఐలు దత్తత తీసుకునేలా వారితో సంప్రదింపులు జరపాలి. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల నెట్‌వర్కింగ్ చేయాలి. రెసిడెన్షియల్ స్కూళ్లలో స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యా, వైద్యసేవలు అందించే వాళ్లకు అవకాశం కల్పించాలి" అని చంద్రబాబు సూచించారు. పేదలు, బలహీనవర్గాలకు సంక్షేమం అందించడమే కాదు..వారి జీవనోపాధిని మెరుగుపరిచి మరింత ఆదాయాలు సమకూర్చేందుకు అన్నీ మార్గాలను అన్వేషించాలని సీఎం కోరారు.

ప్రభుత్వం నుంచి అందించే సంక్షేమం, మెప్మా, డ్వాక్రా పథకాల ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు పీ4 ద్వారా సాయం అందాలన్నారు.

**ఎంతైనా ఖర్చు చేస్తాం : మంత్రి డోలా**

వైసీపీ హయాంలో హాస్టళ్లు, గురుకులాలు సమస్యలకు నిలయంగా ఉండేవని, రెండేళ్లలోనే పరిస్థితిని సమూలంగా మార్చివేశామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పేద విద్యార్థుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తామన్నారు. డైట్ చార్జీలు పెంచడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బెంగళూరుకు ఆవల మరిన్ని

# కొత్త బెంగళూరుల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని అన్నారు. టైర్ టూ, త్రీ నగరాల్లో ఇది అర డాలర్‌కే లభిస్తోంది. అక్కడ డబుల్ ఎఫ్ఏఆర్ (ఫీూ=) అందించాలని మేము ప్రతిపాదించాము. దీని ద్వారా, అక్కడ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి కూడా అనుమతి ఇవ్వాలని ప్రతిపాదించాము. కర్ణాటకలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. మీ సూచనలకు మేము సిద్ధంగా ఉన్నాము, అని ఆయన అన్నారు. మరింత బలంగా ఎదగడానికి మీరందరూ సంపూర్ణ సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. మీరు బలపడితే, మేము కూడా బలపడగలం. మీరందరూ కర్ణాటక ప్రగతికి భాగస్వాములు, రాయబారులు. ఈ రాష్ట్ర, దేశ ప్రగతి కోసం మేము మీతో కలిసి పనిచేయబోతున్నాం. మనమందరం 'టీమ్ కర్ణాటక' అనే ఒకే జట్టు. మనమందరం కలిసి పనిచేద్దాం. కలిసి రావడం ఆరంభం, కలిసి ఆలోచించడం ప్రగతి, కలిసి పనిచేయడం విజయం అని ఆయన అన్నారు.

**బెంగళూరులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 1.5 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు**

ప్రతి నెలా బెంగళూరులో 30,000 కొత్త వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి. అందువల్ల, మేము సులభమైన ట్రాఫిక్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాము. మేము ఇప్పటికే 350 కిలోమీటర్ల మెట్రో కనెక్టివిటీకి ప్రణాళిక రచించాము మరియు వచ్చే ఏడాది నాటికి దానిని 500 కిలోమీటర్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మీరందరూ హెబ్బాల్ సమీపంలో ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్నారు. ఇందుకోసం, మేము ఒక చిన్న టన్నెల్ రోడ్డు పనులను ప్రారంభించాము. అదనంగా, బెంగళూరులో 40 కిలోమీటర్ల పొడవైన టన్నెల్ రోడ్డును నిర్మించాలని మేము ప్రతిపాదించాము, మరియు తదుపరి క్యాబినెట్‌లో దీనిపై చర్చించిన తర్వాత వీలైనంత త్వరగా ఉత్తర్వులు జారీ చేయబడతాయి. అంతేకాకుండా, మేము 44 కిలోమీటర్ల పొడవైన డబుల్ డెక్కర్ ప్రాజెక్ట్‌కు ప్రణాళిక రచించాము. మేము 133 కిలోమీటర్ల పొడవైన ఫ్లైఓవర్‌కు ప్రణాళిక రచించాము. అదనంగా, మేము 123 కిలోమీటర్ల పొడవైన బెంగళూరు బిజినెస్ కారిడార్‌ను నిర్మిస్తున్నాము. మొదటి దశ కోసం మేము 26 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాము. ఈ విధంగా, మేము బెంగళూరు పురోగతితో ముందుకు సాగుతున్నాము. బెంగళూరు అభివృద్ధి కోసం మేము 1.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాము, అని ఆయన తెలియజేశారు.

## కెనడా పెట్టుబడులకు

# తెలంగాణే కేరాఫ్ అడ్రస్


(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం కాదు. నదీ తీర ప్రాంతాన్ని సుస్థిర ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దే ఒక సమగ్ర ప్రణాళిక. ఈ బృహత్తర ప్రాజెక్టుతో పాటు హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ సరికొత్తగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ మౌలిక సదుపాయాల కల్పనలో కెనడాకు చెందిన అంతర్జాతీయ సాంకేతిక నైపుణ్యం, పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో హరిత ఆర్థిక వ్యవస్థ గ్రీన్ ఎకానమీ లక్ష్యాల సాధనలో కెనడా సహకారం అందించాలన్నారు.

సమాచార సాంకేతికత , జీవ విజ్ఞాన శాస్త్రాలు లైఫ్ సైన్సెస్, రక్షణ , ఏరోస్పేస్ తదితర రంగాల్లో తెలంగాణ అద్భుతమైన పురోగతి సాధించిందని వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత ఫార్చ్యూన్-500 కంపెనీల గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ నేడు ప్రధాన కేంద్రంగా మారిందని వెల్లడించారు. తెలంగాణను ప్రపంచ స్థాయి విజ్ఞాన, ఆవిష్కరణల కేంద్రంగా గ్లోబల్ నాలెడ్జ్ హబ్ మార్చడమే మా లక్ష్యమని, ఇందుకోసం అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఇక్కడ క్యాంపస్‌లు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి తెలిపారు. ఈ నేపథ్యంలో, కెనడాకు చెందిన పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలన్నీ ఉమ్మడిగా కలిసి హైదరాబాద్‌లో ఒక 'మల్టీ-యూనివర్సిటీ క్యాంపస్'ను ఏర్పాటు చేయాలి.తెలంగాణలో కెనడా భాగస్వామ్యం మరింత విస్తరించడానికి వీలుగా, ఈ ఏడాది డిసెంబర్‌లో మా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - రెండో ఎడిషన్'కు కెనడియన్ కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు మరియు ఆవిష్కరణ భాగస్వాములు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారికి మా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుంది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో స్పష్టం చేశారు.ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు మరియు ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, ఐటీఈఅండ్‌సీ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, మరియు పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు

# ఏపీలో హాస్టల్,గురుకులాల మెస్ ఛార్జీల పెంపు

### - సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్ణయం



**అమరావతి- సూర్య వాస్తవం:** హాస్టళ్లు, గురుకులాల మెస్ ఛార్జీలను పెంచాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సంక్షేమ శాఖల మంత్రులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సచివాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఛార్జీలపై 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని సీఎం పేర్కొన్నారు. ఎంజేపీ స్కూళ్ల శాశ్వత భవనాలకు రూ.500 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హాస్టళ్లు, గురుకులాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మెస్ ఛార్జీల పెంపునపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మెస్ ఛార్జీల పెంపుతో విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించవచ్చని తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు సొంతిళ్లు మాదిరిగా సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు.

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

- హ్యోసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు
- బుసాన్‌లో హ్యోసంగ్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ క్లస్టర్ ప్రతిపాదన
- ఏపీలో ఆర్అండ్‌డీ, ఇన్నోవేషన్ సెంటర్ కోరిన మంత్రి
దక్షిణ భారత తయారీ క్లస్టర్‌పై ప్రత్యేక ప్రతిపాదన
- కుప్పంలో రూ.900 కోట్ల ప్లాంట్‌ను గుర్తు చేసిన హ్యోసంగ్
- ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కంపెనీ హామీ



**అమరావతి- సూర్య వాస్తవం**

దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్.. ప్రముఖ హ్యోసంగ్ గ్రూప్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో బుసాన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌వేర్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేలా పలు కీలక ప్రతిపాదనలు చేశారు. కుప్పంలో హ్యోసంగ్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినందుకు కంపెనీ ప్రతినిధులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. అదే ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్, మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని వివరించారు. ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత కస్టమైజేషన్, సస్టెయినబుల్ మెటీరియల్స్‌పై పరిశోధనలు జరిగే నెక్స్ట్ జనరేషన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు సేవలందించేలా సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఇందులో కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ కేంద్రం, విశాఖపట్నంలో డిజైన్, కార్పొరేట్, లాజిస్టిక్స్ విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే హ్యోసంగ్ ఫుట్‌వేర్‌కు చెందిన టైర్-1, టైర్-2 విక్రేతలతో ఏపీలో సప్లయర్ సమావేశం నిర్వహించాలని కోరారు. సమావేశంలో హ్యోసంగ్ కార్పొరేషన్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్-రియోంగ్ స్పందించారు. కుప్పంలో రూ.900 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. అడిడాస్‌తో పాటు పలు అంతర్జాతీయ బ్రాండ్లకు ఓఈఎం సరఫరాదారుగా ఉన్న ఈ ప్లాంట్‌లో ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూలను తయారు చేయనున్నట్లు చెప్పారు. మొదట ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని ఉత్పత్తి ప్రారంభిస్తామని, తర్వాత దేశీయ మార్కెట్‌కు కూడా విస్తరిస్తామని వెల్లడించారు. పుణే, చెన్నై, అనంతపురం జిల్లా గూడపల్లిలో ఆటో విడిభాగాల తయారీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## ఆరేళ్లలో 67 లక్షల సైబర్ నేరాలు



ప్రపంచం మొత్తం మీద డిజిటల్ డేటాలో భారతదేశం ఇప్పుడు 20 శాతానికి చేరుకుంది. డిజిటల్ చెల్లింపులు, స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరగడంతో సైబర్ నేరాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు కృత్రిమ మేధస్సు (ఎఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీ ఉపయోగించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో ప్రజలను మోసగిస్తున్నారు. కొన్ని కోట్లు కొల్లగొడుతున్నారు. 2019- 2025 వరకు 67.32 లక్షల సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండింట మూడొంతులు అంటే 43.22 లక్షల కేసులు గత రెండేళ్ల లోనే నమోదు కావడం గమనార్హం. గత ఆరేళ్లలో సైబర్ మోసాల ద్వారా సుమారు రూ. 55,000 కోట్లు బాధితులు నష్టపోయారు. అంటే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు సైబర్ మోసాల ఖాతాకే చేరాయి. అంతేకాదు అశ్లీల పదజాలం కూడా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లద్వారా వ్యాప్తి చెందుతోంది.రేప్ వీడియో, చైల్డ్ వీడియో ద్వారా పిల్లలకు సంబంధించిన అసభ్యకరమైన పదజాలంతో పెయిడ్ యాడ్స్ కనిపించాయని వాటిని క్లిక్ చేసిన వినియోగదారులు టెలిగ్రామ్ ఛానెళ్లకు మళ్లించి ఆ వీడియోలను విక్రయిస్తున్నారని ఓ మీడియా సంస్థ బయటపెట్టగా ప్రభుత్వం స్పందించి ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత మెటా సంస్థను గట్టిగా హెచ్చరించింది. ఇలాంటి సంఘటనలు చాలా పెద్ద సమస్యలో ఓ చిన్నభాగం మాత్రమే. రోజురోజుకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అంతకన్న వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ చట్టాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటివరకు డీప్‌ఫేక్స్, ఇతర సమస్యలను నివారించడానికి ప్రభుత్వం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)చట్టంపై ఆధారపడుతూ వచ్చింది అయితే ఎఐ వ్యవస్థలు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, సాంకేతికతను సురక్షితంగా మార్చడానికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ పర్యావరణ వ్యవస్థ మనకు ఏర్పాటైంది. ఇందులో ఆధార్, యుపిఐ, ఒఎన్‌డిసి వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. ఆధార్ వల్ల ప్రజల గుర్తింపు స్థిరీకరణ జరగడమే కాక, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు నేరుగా చేరడానికి ఉపయోగపడుతుంది. యుపిఐ అన్నది తక్షణ చెల్లింపుల వ్యవస్థ. స్మార్ట్‌ఫోన్ ద్వారా చిల్లర వ్యాపారం నుండి పెద్దపెద్ద లావాదేవీల వరకు సెకన్లలో డబ్బులు పంపడానికి, స్వీకరించడానికి తోడ్పడుతోంది. ఒఎన్‌డిసి వాణిజ్య రంగాన్ని వికేంద్రీకరించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఓపెన్ నెట్‌వర్క్. దీని ద్వారా చిన్న వ్యాపారులు, స్థానిక విక్రేతలు, కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించవచ్చు. ఈ ప్లాట్‌ఫారాలన్నీ సామాన్యుల దైనందిన జీవితాన్ని ఎంతో సులభతరం చేశాయి. ఇవి పాలనా వ్యవహారాలను, ఆర్థిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి.ఈ సౌకర్యాలు ఎలా ఉన్నా డిజిటల్ దాడులు విస్తరించే ప్రమాదాలు కూడా పెరిగాయి. కృత్రిమ మేధస్సు సహాయంతో జరిగే సైబర్ దాడులను గుర్తించడం, వాటిని నివారించడం చాలా కష్టంగా మారుతోంది. ఈ దాడులు బ్యాంకింగ్, టెలికమ్యూనికేషన్స్, రక్షణ (డిఫెన్స్), విద్యుత్, ఆరోగ్య భద్రతరంగాలకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారంగానే సైబర్ నేరగాళ్లు అత్యంత నమ్మదగిన ఫిషింగ్ ఈ మెయిల్స్, డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ గుర్తింపులు, అధునాతన మాల్వేర్‌ను సృష్టిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ కనిపెట్టలేని విధంగా నిరంతరం తమ కోడ్‌ను మార్చుకునే మాల్‌వేర్‌ను సృష్టిస్తున్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎఐ టూల్స్ సహాయంతో హ్యాకర్లు సాఫ్ట్‌వేర్‌లో లోపాలను అందరికన్నా ముందుగానే పసిగట్టి దాడులకు పాల్పడుతున్నారు. వీటిని నివారించడం సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పెద్ద సవాలుగా మారింది. సైబర్ ముప్పులను నివారించడానికి ప్రభుత్వం అనేక ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. ఇండియా ఎఐ మిషన్‌తోపాటు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి ఇన్) వ్యవస్థను బలోపేతం చేసింది. జీరో ట్రస్ట్ అనే పద్ధతిని స్వీకరించింది.సాధారణ భద్రత విధానాల్లో ఒకసారి నెట్‌వర్క్ లోకి ప్రవేశించిన ఎవరినైనా లేదా ఏదైనా పరికరాన్ని నమ్ముతారు. కానీ జీరో ట్రస్ట్ విధానంలో, నెట్‌వర్క్ లోపల ఉన్నా లేదా బయట ఉన్నా ఎవరినీ గుడ్డిగా నమ్మరు. ఆ వినియోగదారుడి పనికి అవసరమైన డేటా, ఫైల్స్ లేదా అప్లికేషన్‌కు మాత్రమే అనుసంధానం కలుగుతుంది. దీనివల్ల డేటా రక్షణ కలుగుతుంది. సైబర్ దాడుల నుండి డేటాను కాపాడుకోడానికి ప్రభుత్వ ఏజెన్సీలు సిఇఆర్‌టి ఇన్ వంటి సంస్థలు భద్రతా లోపాలను గంటల వ్యవధి లోనే పరిష్కరించాలన్న నిబంధనలు తీసుకు వస్తున్నారు. భారత్ ఏ దేశంపై ఆధారపడకుండా ఇప్పుడు స్వంతంగా కృత్రిమ మేధస్సు సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. రూ.10,300 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించింది. లక్షలాది మందికి ఉపయోగపడేలా జిపియు కంప్యూటింగ్ (గ్రాఫింగ్ ప్రాసెసింగ్ యూనిట్), స్టార్టప్ ఫండింగ్ వ్యవస్థలను అందుబాటు లోకి తెస్తోంది. ఏదేమైనా ఈ ప్రయత్నాలన్నీ విచ్ఛిన్నంగానే ఉంటున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 1,01,118 సైబర్ నేరాలు నమోదయ్యాయి. కాగా తెలంగాణలో వాటి సంఖ్య 27,230. అంటే తెలంగాణ వాటానే 27%గా నమోదయింది.

రాష్ట్రంలో రోజుకు సగటున 75 సైబర్ నేరాల కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో కర్ణాటకలో 21,993 కేసులు నమోదై రెండోస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల బారిన పడుతున్న బాధితుల్లో తెలంగాణ వాసులు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది. జనాభా ఆధారంగా రాష్ట్రంలో క్రైమ్‌రేట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 71.1గా నమోదు అయింది. రెండోస్థానంలో ఉన్న కర్ణాటకలో అది 32.2. దేశవ్యాప్త సగటు 7.4 మాత్రమే ఉంది. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత విషయంలో పోలీస్‌శాఖ వాదన మరోలా వినిపిస్తోంది. తమకు అందుతున్న ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తుండటంతోనే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా కేసుల నమోదులో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు అభియోగపత్రాల నమోదు రేటులో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సగటు కేవలం 16.2 కాగా దేశవ్యాప్త సగటు ఏకంగా 31.6గా నమోదయింది.వీటికి సంబంధించిన ఏజెన్సీలు వేటికి అవే స్వతంత్రంగా పనిచేస్తున్నాయి తప్ప సమన్వయం కనిపించడం లేదు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (14 సి)ను బలోపేతం చేయడం ద్వారా కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య సమన్వయం పెరిగి సైబర్ బెదిరింపుల ముప్పును ఎదుర్కోగలుగుతారు. భారత దేశం తన ఎఐ వ్యూహంలో కేవలం సాంకేతికతను అభివృద్ధి చేయడమే కాక, దానిని సైబర్ దాడుల నుండి రక్షించుకునే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవడం తప్పనిసరి

# "మట్టి మనిషి... రైతు గుండె చప్పుడు... పేదల ఆపద్బాంధవుడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి"

చరిత్రలో నాయకులు ఎందరో వస్తారు... వెళ్తారు...
కొంతమంది పదవులను పాలిస్తారు...
మరికొందరు ప్రజల మనసులను గెలుచుకుంటారు.
కానీ అరుదుగా మాత్రమే ఒక నాయకుడు
ప్రజల కన్నీళ్లలో, రైతు చెమటలో,
పేదవాడి చిరునవ్వులో, ఒక కుటుంబం
ఊపిరిలో శాశ్వతంగా జీవిస్తాడు.
అలాంటి నాయకుడే డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి.




ఆయన ఈ లోకాన్ని విడిచి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ఈ రోజు కూడా ఒక రైతు పొలంలో నిలబడి పంటను చూస్తున్నప్పుడు... ఒక వృద్ధుడు పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నప్పుడు... ఒక పేద కుటుంబం వైద్యం గురించి మాట్లాడుతున్నప్పుడు... ఒక విద్యార్థి తన చదువు గురించి ఆలోచిస్తున్నప్పుడు... ఎక్కడో ఒకచోట వైఎస్సార్ పేరు వినిపిస్తూనే ఉంటుంది.

**ఎందుకంటే...**

ఆయన ప్రజలకు కేవలం ముఖ్యమంత్రి కాదు... కష్టకాలంలో తోడుగా నిలిచిన మనిషి.
రైతు కన్నీరు చూసి చలించిన నాయకుడు
ఒకప్పుడు అప్పుల భారం, ఎండిన బావులు, కరువు, విద్యుత్ సమస్యలు, నీటి కొరతతో రైతు జీవితం దిక్కుతోచని స్థితిలో ఉండేది.
ఆ బాధను కేవలం నివేదికల్లో చదవలేదు వైఎస్సార్...
రైతు పొలంలో నిలబడి చూశారు.
ఆ రైతు ఇంట్లో కూర్చొని విన్నారు.
ఆ కన్నీళ్లకు సమాధానం వెతికారు.
అందుకే రైతును కాపాడాలంటే ముందుగా వ్యవసాయాన్ని కాపాడాలని నిర్ణయించారు.

**ఉచిత విద్యుత్... రైతు జీవితంలో వెలుగులు**

వ్యవసాయం ఖర్చుతో కూడుకున్న వృత్తిగా మారుతున్న సమయంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా వారి భారం తగ్గించాలని ప్రయత్నించారు.బోరు మోటార్లు తిరిగాయి...ఎండిన పొలాల్లో ఆశలు మొలిచాయి...'వ్యవసాయం ఇంకా చేయగలం" అనే ధైర్యం ఎంతో మంది రైతుల్లో పెరిగింది.

**జలయజ్ఞం... ప్రతి నీటి చుక్క రైతు భవిష్యత్తు కోసం**

"నీరు ఉంటేనే రైతు బతుకుతాడు... రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుంది" అనే భావనతో భారీ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.నదుల నీటిని పొలాలకు తీసుకెళ్లే లక్ష్యంతో అనేక ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి.

**కొన్ని పూర్తయ్యాయి...**

మరికొన్ని తరువాతి ప్రభుత్వాల కాలంలో కొనసాగాయి...

కానీ రైతు భూమికి నీరు చేరాలనే ఆలోచనను రాష్ట్ర అభివృద్ధి చర్చల్లో ప్రధాన అంశంగా నిలిపిన నాయకుడిగా వైఎస్సార్‌ను పలువురు గుర్తిస్తారు.

**ఆరోగ్యశ్రీ... డబ్బు లేని పేదవాడికి ప్రాణ భరోసా**

"డబ్బు లేక చనిపోవద్దు" అనే భావనతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారు. ఆసుపత్రి గుమ్మం దాటలేమనుకున్న ఎన్నో కుటుంబాలకు ఆ పథకం ఆశాకిరణంగా మారింది.
ఎన్నో ఇళ్లలో నేటికీ ఒక మాట వినిపిస్తుంది... "ఆ రోజుల్లో ఆ పథకం లేకపోయి ఉంటే... మా మనిషి ఉండేవాడు కాదు."

**ఫీజు రీయింబర్స్‌మెంట్... పేద పిల్లల కలలకు రెక్కలు**

చదువు డబ్బున్న వారి హక్కు మాత్రమే కాదు... పేదవాడి హక్కు కూడా కావాలని ఆయన నమ్మారు. ఉన్నత విద్య ఆర్థిక ఇబ్బందులతో ఆగిపోకుండా వేలాది మంది విద్యార్థులకు అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టారు. ఎన్నో కుటుంబాల్లో మొదటి గ్రాడ్యుయేట్ పుట్టడానికి ఆ నిర్ణయాలు తోడ్పడ్డాయని లబ్ధిదారులు చెబుతుంటారు.

**ఇందిరమ్మ ఇళ్లు... సొంతింటి కలకు రూపం**

గుడిసెల్లో జీవించిన ఎన్నో కుటుంబాలకు సొంత ఇంటి ఆశ చూపే గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. "ఇది మా ఇల్లు" అని గర్వంగా చెప్పుకునే అవకాశం ఎన్నో కుటుంబాలకు లభించింది.
మహిళలకు, వృద్ధులకు, నిరుపేదలకు అండగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం, సామాజిక భద్రత పథకాలు, వృద్ధులు, వికలాంగులు, నిరుపేదల సంక్షేమానికి తీసుకున్న చర్యలు సమాజంలోని బలహీన వర్గాలపై దృష్టిని ప్రతిబింబించాయి.

**ప్రజల మధ్యే జీవించిన నాయకుడు**

ముఖ్యమంత్రి కార్యాలయంలో కూర్చొని ప్రజలను చూడలేదు...ప్రజల మధ్యకే వెళ్లి వారి బాధలు తెలుసు కున్నారు. అందుకే ఆయనను ఇప్పటికీ చాలామంది "మన నాయకుడు" అని సంభోదిస్తారు.

**ప్రజల మనసులో ఇప్పటికీ వినిపించే మాటలు...**

"మా పొలంలో నీరు వచ్చిన రోజును మర్చిపోలేం..." "రైతు విలువ తెలిసిన ముఖ్యమంత్రి ఆయనే..." "ఆరోగ్యశ్రీతో మా కుటుంబం నిలబడింది..." "నా కొడుకు చదువు పూర్తయ్యేందుకు ఆ పథకం ఉపయోగపడింది..." "పేదవాడి ఇంటి తలుపు తట్టిన నాయకుడు వైఎస్సార్..." ఇలాంటి మాటలు నేటికీ రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో, పల్లెల్లో, కుటుంబాల్లో వినిపిస్తుంటాయి. అదే ఒక నాయకుడు ప్రజల జీవితాల్లో మిగిల్చిన ముద్ర.

**చివరగా...**

ఒక మనిషి మరణిస్తే... ఆయన శరీరం మాత్రమే దూరమవుతుంది. కానీ ఆయన చేసిన మేలు... ఆయన తుడిచిన కన్నీళ్లు... ఆయన నిలబెట్టిన కుటుంబాలు... ఆయన కాపాడిన రైతు పొలాలు... ఆయన వల్ల చదువుకున్న విద్యార్థులు... ఆయన ఆశ్రయంతో ప్రాణం దక్కించుకున్న రోగులు... ఇవన్నీ ఆయనను ప్రతి రోజూ జీవింపజేస్తూనే ఉంటాయి.

**డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఒక వ్యక్తి కాదు...**

రైతు నమ్మకం... పేదవాడి ధైర్యం... సేవకు ప్రతీక... ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఒక భావోద్వేగం.

కాలం మారుతుంది... ప్రభుత్వాలు మారుతాయి... తరాలు మారతాయి... కానీ ప్రజల కోసం చేసిన నిజమైన సేవకు కాలం చెరపలేని చరిత్ర ఉంటుంది. ఆ చరిత్రలో డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది.

# డిసిహెచ్‌ఎస్ కార్యాలయ వ్యవహారంపై ప్రక్షాళన జరుగునా...?

- నిరుద్యోగులను కలవర పెడుతున్న అక్రమ ఉద్యోగ నియామకాల వ్యవహారం
- కలెక్టర్ సారు.... జరా ఇటు చూడండి




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగ నియామకాల వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత నియామకాల్లో జరిగిన అక్ర మాలు, రోస్టర్ ఉల్లంఘనలు, అర్హులైన అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కొత్త కలెక్టర్, సుదీర్ఘ పరిపాలనా అనుభవం ఉన్న ఐఏఎస్ అధికారి ఆనంద్ ఓ. గారిపై, అలాగే డీఎస్‌హెచ్ కమిషనర్ కేవీఎన్ చక్రధర్ బాబు పై అనంత నిరుద్యోగులు తమ ఆశలన్నీ పెట్టుకున్నారు.వ్యక్తుల కంటే వ్యవస్థ గొప్పది. గతంలో మీరు పనిచేసిన ప్రతి జిల్లాలోనూ పారదర్శకతకు పెద్దపీట వేశారు. అదే స్ఫూర్తితో అనంతపురం నిరుద్యోగుల జీవితాల్లోనూ వెలుగు నింపాలని కోరుతున్నారు

**ఐఏఎస్ అధికారులకు అనంతపురం నిరుద్యోగుల విజ్ఞప్తి సమర్థులైన అధికారులపైనే నమ్మకం**

తూర్పుగోదావరి అసిస్టెంట్ కలెక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించి.. గూడూరు సబ్ కలెక్టర్, పోలవరం ప్రాజెక్ట్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్, నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ప్రజాపరిపాలనలో విశేష ముద్ర వేసిన ఆనంద్ ఓ. గారు ప్రస్తుతం అనంతపురం జిల్లా సారథిగా ఉన్నారు.మరోవైపు రెవెన్యూ, విద్యుత్, గిరిజన సంక్షేమం, పట్టణాభివృద్ధి శాఖలతో పాటు ఏపీ జెన్‌కో ఎండీగా, నెల్లూరు కలెక్టర్‌గా సేవలు అందించిన ఐఏఎస్ అధికారి కేవీఎన్ చక్రధర్ బాబు డీఎస్‌హెచ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంతటి అనుభవజ్ఞులైన అధికారులు వ్యవస్థలో ఉంటే తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని నిరుద్యోగ నిరుపేద అభ్యర్థులు బలంగా నమ్ముతున్నారు.

**నిరుద్యోగులను కలవరపెడుతున్న 'పాత బృందం' లీకులు**

ఒకవైపు జిల్లాలో నియామక ప్రక్రియలు పారదర్శకంగా జరగాలని నిరుద్యోగులు కోరుకుంటుంటే.. మరోవైపు క్షేత్రస్థాయిలో వినిపిస్తున్న వార్తలు వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత 2023 100 రోస్టర్ సైకిల్ పూర్తి కాకుండానే మొదటి నుండి ప్రారం భించిన నియామకాల్లో తీవ్రమైన ఫిర్యాదులు, వివాదాలు ఎదుర్కొని, ప్రభుత్వ విచారణలో ఉంటూ, శాఖాపరమైన చార్జ్ మెమోలు పొందిన అధికారులకే మళ్లీ కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. విధి నిర్వహణ లోప వలన చార్జ్ మెమో లు ఎదుర్కొంటున్న అధికారులే మళ్లీ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తే.. గతంలో జరిగిన తప్పులే పునరావృతమవుతాయని, నియామకాల్లో నిష్పాక్షికత లోపిస్తుందని అభ్యర్థులు భయపడుతున్నారు. చార్జ్ మెమో అనేది తుది తీర్పు కాకపోయినా, విచారణ పూర్తయ్యే వరకు ప్రజల్లో ఎటువంటి సందేహాలు రాకుండా సదరు అధికారులను కీలక బాధ్యతలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత కలెక్టర్, కమిషనర్ పై ఉందని వారు గుర్తుచేస్తున్నారు...

**సమగ్ర విచారణ జరగాలి...**
**డిసిహెచ్‌ఎస్ వ్యవహారంపై డిమాండ్ ....**

గత నియామకాల్లోనీ తప్పులను కప్పిపుచే ప్రయత్నాలలో కీలక పాత్ర పోషించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న డా. డేవిడ్ సిల్వన్ రాజు మరియు వారి కోర్ టీమ్ వ్యవహారాలపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం సమగ్ర విచారణ జరిపించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, తద్వారా వ్యవస్థపై ప్రజలకు, నిరుద్యోగులకు నమ్మకం కలిగించాలని కోరుతున్నారు.

**కలెక్టర్, కమిషనర్‌కు నిరుద్యోగుల ప్రధాన విజ్ఞప్తులు ...**

- **పూర్తి పారదర్శకత:** రాబోయే నియామక ప్రక్రియ ఎటువంటి బాహ్య ఒత్తిళ్లకు, లీకులకు తావు లేకుండా వంద శాతం పారదర్శకంగా జరగాలి.
- **బాధ్యతల నుంచి దూరం:** విచారణలు, చార్జ్ మెమోలు ఎదుర్కొంటున్న అధికారుల పాత్రను సమీక్షించి, విచారణ తేలేవరకు వారికి కీలక బాధ్యతలు ఇవ్వకూడదు.
- **బాధితులకు న్యాయం:** గత నియామకాల్లో అన్యాయం జరిగిందని ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసిన అర్హులైన నిరుద్యోగుల సమస్యలను పరిశీలించి న్యాయం చేయాలని నిరుద్యోగ యువత కోరుకుంటున్నారు

**ప్రక్షాళన జరుగునా....?**

"వ్యక్తులు వస్తుంటారు, పోతుంటారు.. కానీ వ్యవస్థ నిలబడాలి" అనే నానుడిని నిజం చేస్తూ, అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ ఓ. , డీఎస్‌హెచ్ కమిషనర్ కేవీఎన్ చక్రధర్ బాబును కలిసి ఈ నియామక వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, అర్హులైన నిరుద్యోగుల ఆవేదనను ఆలకించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా నిరుద్యోగ లోకం హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తోంది.....

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

**- నూతన ఎంహెచ్ఓకి ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన**
**- ఎమ్మెల్యే దగ్గుపాటితో ఎంహెచ్ఓ రాజా రవీంద్రనాథ్ చౌదరి భేటి**
**- పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం మన తొలి ప్రాధాన్యత అన్న ఎమ్మెల్యే**



**అనంతపురం - సూర్య వాస్తవం :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ నూతన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రాజా రవీంద్ర చౌదరికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. నార్పల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పని చేస్తున్న రాజా రవీంద్రనాథ్ డెప్యుటేషన్ పై అనంతపురం నగర పాలకసంస్థకి బదిలీ చేశారు. తాజాగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ పరిధిలోని పలు అంశాల గురించి చర్చించారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం ప్రధాన లక్ష్యంగా పని చేయాలని సూచించారు. నగరంలో క్రమం తప్పకుండా చెత్త సేకరణ, వీధుల శుభ్రత, డ్రైనేజీల నిర్వహణ, దోమల నివారణ చర్యలను పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. వీటి విషయంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనలు చేశారు.

# ఎస్ఐఆర్ ఫారాలు త్వరగా నింపి బీఎల్‌వోలకు అందజేయండి

**- అసిస్టెంట్ ఎన్నికల అధికారి బ్రహ్మయ్య**



**కణేకల్- సూర్య వాస్తవం:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయ వంతంగా పూర్తి చేయ డంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించా లని అసిస్టెంట్ ఎన్నికల అధికారి బ్రహ్మయ్య సూచించారు. కనేకల్ పట్టణంలో ఇప్పటికీ ఎస్ఐఆర్ ఫారాలు అందని ఓటర్లు మండల తహసీల్దార్ కార్యాలయం లేదా శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రాన్ని సంప్రదించి వెంటనే ఫారాలను పొందాలని కోరారు. ఇప్పటికే ఫారాలు తీసుకున్న వారు వాటిని పూర్తి వివరాలతో, ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా నింపి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లకు వీలైనంత త్వరగా అందజేయా లని సూచించారు. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, నివాస ధ్రువీకరణ వంటి అవసరమైన పత్రాలను జతచేసి ఫారాలను సమర్పిస్తే పరిశీలన ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ఇంకా ఫారాలు తీసుకోని అర్హులైన ఓటర్లు తమ పరిధిలోని బీఎల్ వోలను లేదా సమీపంలోని ప్రత్యేక కేంద్రాలను సంప్రదించి ఫారాలను వెంటనే పొందాలని బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. గడువు చివరి రోజుల్లో రద్దీ ఏర్పడకుండా ముందుగానే ఫారాలను సమ ర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా నమోదు కావడానికి ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. గడువులోపు ఫారాలు సమర్పించని పక్షంలో వివరాల ధృవీకరణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తూ, వాటి నింపే విధానంపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బీఎల్‌వోలను లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించేందుకు ప్రజలందరూ సహకరించాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి బ్రహ్మయ్య విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా అనఘాష్టమి వ్రతం

**- భక్తులతో కిటకిటలాడిన ఆశ్రమం - అన్నప్రసాద వితరణ**



**పామిడి -సూర్యవాస్తవం :** పామిడి పట్టణంలోని అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో బుధవారం అనఘాష్టమి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పరమపూజ్య శ్రీగణపతి సచ్చిదా నంద స్వామీజీ దివ్యానుగ్రహంతో, పూజ్యశ్రీ బాల స్వామీజీ వారి ఆదేశానుసారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో శ్రీ దత్త భక్తులు హాజరయ్యారు. ఉదయం ప్రత్యేక పూజలు, శ్రీ అనఘాష్టమి వ్రతం, మహా మంగళహారతి కార్యక్రమాలను వైభవంగా అర్చ కులు అమరేంద్ర నిర్వ హిం చారు. అనంతరం భక్తులకు అనఘా వ్రత ప్రత్యేక తోరం (రక్ష)ను అందజేసి, అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గురుదేవుల ఆశీస్సులు పొందేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. వ్రత ప్రధాన సేవా కర్తలుగా ఎన్.ఎస్.ఎం. సీతమ్మ, ఎం.హెచ్. లక్ష్మీనారాయణరెడ్డి, కీ.శే. బండపల్లి రఘునాథ రెడ్డి ధర్మపత్ని బండ పల్లి రేవతి కుటుంబసభ్యులు సేవలు అందించారు. ప్రధాన అన్నదాన సేవను బండ పల్లి రేవతి, వారి కుమారుడు బండపల్లి అనిల్ రెడ్డి భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. కార్యక్రమంలో శ్రీగురుదత్త సేవా సమితి కార్యవర్గ సభ్యులు, ఆలయ అర్చకులు, సేవాదారులు, దత్త భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చిన్నారి ప్రాణాన్ని నిలిపిన మంత్రి పయ్యావుల చొరవ..

**- రూ.7.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**



**ఉరవకొండ- సూర్య వాస్తవం:** ఆపదలో ఉన్న ఒక నిరుపేద కుటుంబానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారు కొండంత అండగా నిలిచారు. అరుదైన నయం కాని వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక చిన్నారిని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం మంజూరు చేయడం స్థానికంగా పెద్ద ఎత్తున అభినందనలు అందుకుంటోంది.

**సమస్య తీవ్రత - మంత్రి గారి తక్షణ స్పందన**

ఉరవకొండ పట్టణానికి చెందిన హనుమంతు, లత దంపతుల ఆరు నెలల కుమారుడు కుమ్మరి లోకేష్ అరుదైన ప్రైమరీ హీమోఫా గోసైటిక్ లింఫోహిస్టియోసిస్ అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులు భరించే స్తోమత లేక నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులు ఐదు రోజుల క్రితం మంత్రి పయ్యావుల కేశవ్ గారిని కలిసి తమ ఆవేదనను వివరించారు. బాధితుల పరిస్థితిని చూసి చలించిపోయిన మంత్రి తక్షణమే స్పందించి వారికి ధైర్యం చెప్పారు. వెంటనే హైదరాబాద్‌లోని సింధు హాస్పిటల్ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి, చిన్నారికి తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని ఆదేశించారు.

**ఐదు రోజుల్లోనే రూ. 7.5 లక్షల సహాయం**

మంత్రి ఇచ్చిన మాట ప్రకారం. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 7.5 లక్షల (7,50,000) ఆర్థిక సహాయాన్ని అత్యంత వేగంగా మంజూరు చేయించారు. అనంతపురం లోని తన స్వగృహంలో ఈ రోజు చిన్నారి తల్లికి మంత్రి ప య్యావుల కేశవ్ స్వయంగా ఈ లబ్ధి చెక్కును అందజేశారు.

**ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు**

తమ బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు ఇంత వేగంగా స్పందించి, ఆర్థికంగా అండగా నిలిచినందుకు చిన్నారి తల్లిదండ్రులు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మంత్రి పయ్యావుల కేశవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. "చిన్నారి లోకేష్ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షిద్దాం!"

# శ్రీ చైతన్య కళాశాల ఫీజుల దోపిడి

**- పుస్తకాల పేర్లతో వేల రూపాయల వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య కళాశాల**
**- ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకు విరుద్ధంగా వసూలు**
**- శ్రీ చైతన్య కళాశాల పైన చర్యలు తీసుకోవాలలని డిమాండ్**
**- విద్యార్థుల నుంచి డబ్బులు కట్టించుకొని ఇంతవరకు విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాల యాజమాన్యం**
**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా**



**అనంతపురం / ఉరవకొండ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న నిరసిస్తూ విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భం గా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హను మంతు రాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వసూలు చేయకుండా రకరకాల పేర్లు పెట్టుకుని ఎంపీసీ బైపిసి గ్రూపులలో ఐపీఎల్ నియానో సి 120 మార్కెట్లో దొరికే కూరగాయల పేర్లు ఎలా అయితే రకరకాలుగా ఉంటాయో అలా విద్యా ర్థుల చదువుకు రకరకాల పేర్లు పెట్టుకొని ఒక గ్రూపుకి ఒక్కొక్క ఫీజు నిర్ణయించి విద్యార్థుల తల్లితండ్రుల దగ్గర నుండి లక్షల రూపాయలు దండుకుంటున్నారని మండి పడ్డారు.. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలను ఏమాత్రం లెక్క చేయకుండా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విచ్చల విడిగా ఒక తరగతికి 17వేల రూపాయల నుంచి 22 వేల రూపాయల వరకు పుస్తకాల పేర్లతో వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకున్న విద్యార్థికి కట్టించుకున్న ఫీజుకి రెండవ సంవత్సరం వచ్చేసరికి రూ5000 నుంచి రూ.10వేల పెంచి మిగతా కళాశాలలో కానీ ఎవరైనా కట్టించు కుంటారు కానీ శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం మొదటి సంవత్సరం విద్యార్థి తల్లిదండ్రులు కట్టిన ఫీజుకు డబుల్ చేసి సెకండ్ ఇయర్‌కి కట్టించుకోవడం దారుణమని పేర్కొన్నారు.

తక్షణమే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ వంశీ చందు నాయకులు నవీన్ సాయి సుశ్రుత్ రాకేష్ హరికృష్ణ దిలీప్ తారక్ రిషి భాను తదితరులు పాల్గొన్నారు.

# 12న లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం





**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు ఈనెల 12 ఆదివారం పామిడి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, అలాగే లైన్స్ క్లబ్ చైర్మన్ రఘువీర్ రావు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం బెంగళూరులో ప్రఖ్యాతి చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపుణుల నేతృత్వంలో చికిత్సలు నిర్వహించబడును అని వారు పేర్కొన్నారు. శిబిరంలో పామిడి మండలమే గాక చుట్టుప్రక్కల మండలాల కంటి జబ్బు వారు కూడా పాల్గొనవలసినదిగా వారు తెలిపారు. శిబిరంలో పాల్గొనవారు ఆధార్ కార్డు జిరాక్స్,పాస్ ఫోటో తోపాటు పరిశుభ్రమైన దుస్తులు ధరించి మూతికి మాస్క్ వేసుకొని రావాలని వారు పేర్కొన్నారు. వైద్య నిపుణులచే ఆపరేషన్లకు ఎంపికైన వారిని అదే రోజు ఉచితముగా శంకర కంటి ఆసుపత్రి చెందిన బస్సులు బెంగళూరుకు తీసుకువెళ్తారని, ఆపరేషన్లు తదనంతరం తిరిగి అదే బస్సులు ఉచితంగా పామిడి పట్టణమునకు తీసుకొని వస్తారని వారు తెలిపారు. కావున కంటి జబ్బు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# వేగంగా అభివృద్ధి పనులు

**- రోడ్డు, సోలార్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే**

**తాడిపత్రి - సూర్య వాస్తవం :** పట్టణ ప్రజల ప్రయాణ ఇబ్బందులను తొలగించడమే ధ్యేయంగా గాంధీకట్ట నుంచి నంద్యాల రోడ్డుకు నూతన రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో మురికి కాలువగా ఉన్న ఈ మార్గంలో భారీ పైపులను ఏర్పాటు చేసి, దానిపై నూతన రోడ్డును నిర్మిస్తున్నారు. బుధవారం ఈ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కనెక్టింగ్ రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రజలకు నంద్యాల రోడ్డుకు వెళ్లే ప్రయాణ సమయం భారీగా తగ్గుతుందని, ట్రాఫిక్ సమస్యలు కూడా తీరుతాయని అన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో, అత్యంత త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

**సోలార్ ప్లాంట్ పరిశీలన:**

అనంతరం తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ పనులను కూడా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పరిశీలించారు. పట్టణ ప్రగతిలో భాగంగా పునరుత్పా దక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచేందుకు ఈ ప్లాంట్ ఎంతో దోహదపడుతుందని, మున్సిపాలిటీకి విద్యుత్ ఖర్చులు కూడా తగ్గుతాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## ప్రతి రైతు కుటుంబానికి రూ.1.50 లక్షల

# వ్యవసాయ రుణమాఫీ చేయాలి

- అమరావతికే పరిమితం చేయొద్దు.. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి
- మాజీ ఎంపీ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** అమరావతి ప్రాంతంలోని ఏడు గ్రామాల రైతులకు ప్రకటించిన రూ.1.50 లక్షల వ్యవసాయ రుణమాఫీ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రైతు కుటుంబానికి వర్తింపజేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఆర్థిక సంక్షో భాన్ని ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతు న్నారని, పంట పండించడం ఒక సవాలైతే దానిని గిట్టుబాటు ధరకు విక్రయించడం మరో పెద్ద సమస్యగా మారిందన్నారు. తోతాపురి మామిడి, మిర్చి, పొగాకు, పసుపు, అరటి, చెరకు, ఉల్లి, శనగ తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు.పంటల బీమా సమర్థంగా అమలు కావడం లేదని, పంట నష్టపరిహారం కూడా సకాలంలో అందడం లేదని పేర్కొన్నారు. సున్నా వడ్డీ, పావలా వడ్డీ పథకాలు నిర్వీర్యమయ్యాయని, డ్రిప్ ఇరిగేషన్ అమలు ఆశించిన స్థాయిలో లేదన్నారు. ఎరువుల కొరతతో రైతులు పొలాల్లో కాకుండా ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని, గత ఆరు నెలల్లోనే 50 కిలోల ఎరువుల బస్తాపై రూ.500 నుంచి రూ.800 వరకు ధరలు పెరిగాయని చెప్పారు. డీజిల్ ధరల పెరుగు దల కూడా రైతులపై అదనపు భారం మోపుతోందన్నారు.ఈ పరిస్థితుల కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ రుణమాఫీ అత్యవ సరమని పేర్కొన్నారు. అమరావతిలో రెండో విడత భూసమీకరణ కోసం భూములు ఇచ్చిన ఏడు గ్రామాల రైతు కుటుంబా లకు రూ.1.50 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తు న్నామని, అదే ప్రయోజనాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి రైతు కుటుంబానికి విస్తరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు దినోత్సవం సందర్భంగా ప్రతి రైతు కుటుంబానికి రూ.1.50 లక్షల వరకు వ్యవసాయ రుణమాఫీ ప్రకటిం చాలని కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోందని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయ భాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- పిల్లలకు అందుతున్న పోషకాహారం, భవనాల మరమ్మతులు, మౌలిక వసతులను పరిశీలించి పలు సూచనలు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న సేవలు, పోషకాహారం, భవనాల నిర్వహణ, మరమ్మతు పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధ వారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఇరికిపెంట గ్రామ పంచాయతీ పరిధిలోని ఒడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో మొత్తం ఎనిమిది పనులు మంజూరు కాగా, ఆరు పనులు పూర్తయ్యాయని, మరో పని రెండు రోజుల్లో, ఇంకొకటి ఇరవై రోజుల్లో పూర్తవుతాయని ఇంజనీరింగ్ అధికా రులు వివరించారు. మిగిలిన పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదే శించారు. అంగన్‌వాడీ కార్యకర్తతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అందిస్తున్న టిహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) రేషన్ పంపిణీపై ఆరా తీశారు. 95 శాతం పంపిణీ పూర్తైందని, మిగిలిన పంపిణీ కూడా ఈ రోజు పూర్తి చేస్తామని కార్యకర్త తెలిపారు. గుడ్ల పంపిణీ ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం క్రమం తప్పకుండా జరుగుతోందని వివరించారు. చిన్నారులకు అందించే పోషకాహారం నాణ్య తను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచిం చారు. అనంతరం వల్లిగట్ల గ్రామ పంచా యతీ పరిధిలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, కేంద్రంలో నమోదైన చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఏడుగురు చిన్నారులు ఉన్నట్లు అంగన్ వాడీ కార్యకర్త వివరించారు. కొత్తపల్లి అంగన్‌వాడీ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశిం చారు. చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరుగుదొడ్లు, సురక్షిత తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పనుల్లో సహాయ ఇంజనీర్‌తో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రా ల్లో చిన్నారులకు పరిశు భ్రమైన, సురక్షితమైన వాతా వరణంలో సేవలు అందించాలని, భవనాల నిర్వహణ, పోష కాహార పంపిణీ, హాజరు నమోదు, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సూచిం చారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి చిన్నారికి మెరుగైన సేవలు అందేలా అధికారులు, అంగన్ వాడీ సిబ్బంది సమన్వ యంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ కార్య క్రమంలో సిడిపిఓ రాజేశ్వరి, సూపర్వైజర్ హరిత, ఐసీడీఎస్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరికి కీలక బాధ్యత

- సుగవాసి ప్రసాద్ బాబు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు




**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ ఐ ఆర్--2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు తమ వివరాలను ఒకసారి పరిశీలించి, ఎన్యు మరేషన్ ఫారమ్‌ను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా మీ బిఎల్ఓకు అందజేయండి. ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. ప్రతి ఇంటికి ఈ సమా చారాన్ని చేరవేసి, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, యువత అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా సహకరించండి. మీ ఓటు... మీ హక్కు! మీ నమోదు... ప్రజాస్వామ్యానికి రక్షణ! ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా మనమందరం కలిసి కృషి చేద్దాం అన్నారు.

## సేవా కేంద్రాల్లో రైతులకు 50శాతం రాయితీతో కంది విత్తనాలు పంపిణీ

- ఎలినినో ప్రభావంకు గురికాకుండా రైతులు బెట్ట పరిస్థితులు తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి
- మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి



**ముద్దనూరు – సూర్య వాస్తవం :** మండలంలోని కె.తిమ్మాపురం, యామవరం రైతు సేవా కేంద్రాల్లో 50శాతం రాయితీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు కంది విత్తనాల ప్యాకెట్లను మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించ డమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఒకొక్క రైతుకు కనిష్ఠముగా ఒక ప్యాకెట్ 4 కిలోలు గరిష్టంగా 3 ప్యాకెట్లు 12 కిలోలు చొప్పున యల్ ఆర్ జి 105 రకం కంది విత్తనాలను అందించడం జరిగిందని తెలిపారు. రైతుకు మంచి విత్తనం ఇస్తే మంచి దిగుబడులు పొందు తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ కులు సందీప్ కుమార్, సుధాకర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.రామ సుధ, గ్రామ నాయకులు బి.ప్రసాద్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.

## రైతులకు తీపి కబురు

- రూ.25 లక్షల సీఎస్ఆర్ నిధులతో కందూరు వంక ఆనకట్ట పునర్నిర్మాణం!
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- 148.95 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి కష్టాలు తీరనున్న వైనం



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా సోమల మండలం కందూరు వంక వద్ద ఆరేళ్లుగా మరమ్మతులకు నోచుకోక రైతులను వేధిస్తున్న సాగునీటి కష్టాలకు తెరపడనుంది. ఈ ఆనకట్టను పునర్నిర్మిం చేందుకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల నుంచి రూ.25 లక్షలను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నంతో డైవర్షన్ ఆనకట్టను నిర్మిస్తున్నామని, తద్వారా నిలిచిపోయిన సాగునీటి సరఫరాను తిరిగి పునరుద్ధ రించడమే లక్ష్యంగా పెట్టు కున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పనులకు సంబంధించిన పరిపాలనా అను మతులు పూర్తయ్యాయని, పనులను తక్షణమే ప్రారం భించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు వంకలోకి చేరేలోపే నిర్మాణాన్ని పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆనకట్ట పునర్నిర్మాణం పూర్తయితే రాయకుట్టు పెద్ద చెరువు (105 ఎకరాలు), బాపనకుంట (15 ఎకరాలు), జలవాలకుంట (14.95 ఎకరాలు), గొల్లవానికుంట (5 ఎకరాలు), పుల్లివానికుంట (9 ఎకరాలు) వంటి మొత్తం ఐదు చెరువులకు నీటి సరఫరా అందుతుందన్నారు. దీనివల్ల 148.95 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుబాటులోకి వచ్చి, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన కాల్వలకు ఈ కొత్త ఆనకట్టకు అనుసంధానం చేయనున్నామని తెలిపారు. కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణ యంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, డీఈ, ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ గడువును వెంటనే పొడిగించాలి

- ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దు
- సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన చివరి గడువు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో వెంటనే గడువును పొడిగించి ప్రతి అర్హుడికి అవకాశం కల్పించాలని సిపిఐ రాయచోటి నియోజక వర్గం కార్యదర్శి సిద్ది గాళ్ళ శ్రీనివాసులు అన్నారు, బుధవారం స్థానిక సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, కార్మికులు, రైతులు, వృద్ధులు, మహిళలు మరియు పేద ప్రజలలో అధిక శాతం మంది ఇంకా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోలేకపోయారు. సాంకేతిక సమస్యలు, సరైన అవగాహన లేకపోవడం, అధికారుల వద్ద తగిన సౌకర్యాలు లేకపోవడం వల్ల అనేక మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గడువును ముగించడం అంటే వేలాది మంది ప్రజలను వారి హక్కులకు దూరం చేయడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తన హక్కులను వినియోగించుకునే అవకాశం కల్పిం చడం ప్రభుత్వాల బాధ్యత. కానీ ప్రజల సమస్యలను పక్కనపెట్టి గడువులను బలవంతంగా ముగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అందువల్ల ఎస్ఐఆర్ గడువును కనీసం మరో నెల రోజుల పాటు పొడిగించి, గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ప్రతి అర్హుడికి నమోదు చేసుకునే అవకాశం కల్పించాలి. లేకపోతే ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ ఆధ్వ ర్యంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం తప్ప ప్రభుత్వానికి మరో మార్గం ఉండదని హెచ్చరిస్తు న్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఓబులేసు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు పసల ఆంజనేయులు, చుక్క జగన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## పండ్లు బ్రెడ్‌లు పంపిణీ



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** దివంగత మహా నేత డాక్టర్ వైఎస్ రాజ శేఖరరెడ్డి జయంతిని పురస్క రించుకుని బుధవారం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఏర్పాటు చేసిన పండ్లు బ్రెడ్‌లను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ తమకు ప్రియమైన నాయకులు రాజశేఖరరెడ్డి పుట్టినరోజు ఎంతో ప్రాధాన్యత కలదని తెలిపారు. అందరివాడుగా ప్రసిద్ధి చెందిన రాజశేఖరరెడ్డి పాలనను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కులమతాలకు అతీతంగా ప్రాంతీయ భేదాలు లేకుండా పాలన సాగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయప రెడ్డి, కళావతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన ప్రొద్దుటూరు నేతలు



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం పులివెందులకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ప్రొద్దుటూరు నియోజకవర్గం లో ప్రస్తుత రాజకీయ పరిణామలపై ముచ్చటించారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి తోపాటు జగన్ మోహన్ రెడ్డి ని, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి లను వై.యస్.ఆర్.సి.పి కడప జిల్లా ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ స్టేట్ సెక్రటరీ (పార్లమెంట్ ) కల్లూరు నాగేంద్ర రెడ్డి కలిశారు

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఎమ్మెల్యే వరదరా జులరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల కిందట బయటివ్యక్తి ప్రొద్దుటూరు ప్రభుత్వ హాస్పిటల్ కి వచ్చి డాక్టర్ల సీటులో కూర్చొని రోగులకు మందులు రాస్తూ, హాస్పిటల్ లోని వార్డుల నందు తిరుగుతూ సోషల్ మీడియాలో రీల్స్ చేస్తుంటే డాక్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మరలా ఇలాంటి సంఘటన పునరావృతం అయితే చర్యలు తప్పవని డాక్టర్లను, సెక్యూరిటీ సిబ్బందిని హెచ్చరించారు. రీల్స్ చేసిన వ్యక్తి మీద చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్లను, పోలీస్ వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, సూపరింటెండెంట్ ఆనంద్ బాబు, ఆర్ఎంఓ రూపానంద్, డాక్టర్ గోపాల్, కలమల్ల బాబు, నర్సులు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసీల్దార్ కార్తీక్



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** బి.మఠం మండల కేంద్రంలోని కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్ కార్తీక్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బీఎల్ఓ రవిశంకర్‌ను కార్యక్రమం నిర్వహణ, ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి ,సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో రామచంద్రారెడ్డి కూడా పాల్గొని సవరణ కార్యక్రమం సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. తిప్పన నారాయణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు.

## ఘనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు



**బ్రహ్మంగారి మఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలిలో మహానేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు మండల వైఎస్ ఆర్సిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోహార్ వైయస్సార్, జగన్మోహన్ రెడ్డి నాయకత్వం , అవినాష్ రెడ్డి ,శెట్టిపల్లి రఘురామిరెడ్డి, నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఆ మహానేత గురించి గుర్తుచేసుకొని కొనియాడారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల ఉప అధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి మైదుకూరు నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు బండి సుబ్బరాజ, వైఎస్ఆర్సిపి మండల యువ నాయకుడు పసుపులేటి వెంకటేష్, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ యత్తపు సుదర్శన్ రెడ్డి, మండల వైఎస్ఆర్సిపి నాయకులు బి.ఎస్ నారాయణరెడ్డి, మండలం వైఎస్ఆర్సిపి నాయకులు తిప్పన నాగార్జున నాయుడు, సోమయ్య, చంద్ర ఓబుల్ రెడ్డి, భూమిరెడ్డి రమణారెడ్డి, గంగిరెడ్డిపల్లి కృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, రామ మోహన్ రెడ్డి, భూమిరెడ్డి గంగిరెడ్డి, ముత్యాల రామచంద్రారెడ్డి, సిద్ధారెడ్డి ,నరసింహా రెడ్డి, ధర్మిశెట్టి వీర, మల్లి కార్జున రెడ్డి మండల ఉప యువ నాయకులు రమ శీను, యువ నాయకులు ప్రభాస్, జగదీష్, చెన్నకేశవరెడ్డి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంపై ఐటిడిపి నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవం

**- విచారణలో తేల్చిన ఐసిడిఎస్ అధికారులు**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** వీరబల్లి మండల పరిధిలోని వంగిమళ్ళ గ్రామం కావలిగడ్డ అంగన్వాడి కేంద్రం పై ఐటిడిపి నాయకులు సోషల్ మీడియా ద్వారా చేసిన ఆరోపణలు ఆవాస్తవమని సుండుపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ రాజమ్మ అన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో అంగన్వాడి కేంద్రం పై ఐటిడిపి నాయకులు చేసిన ఆరోపణలతో ఐసిడిఎస్ యంత్రాంగం కదిలింది. సుండుపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ రాజమ్మ, వీరబల్లి సూపర్వైజర్ తులశమ్మ లు బుధవారం కావలిగడ్డ అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను, పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు, తల్లులతో ప్రత్యేకంగా సమావేశమై విచారణ చేపట్టారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అంగన్వాడి కేంద్రానికి అంగన్వాడి కార్యకర్త నాగేశ్వరి సెంటర్ కు సక్రమంగా వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కువైట్ కి వెళ్ళిన ఆయా విషయం పై వారు గ్రామస్తులతో మాట్లాడారు. అంగన్వాడి కేంద్రంలో పనిచేస్తున్న ఆయా ఇక్కడ వచ్చే అరకురా జీతం సరిపోకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం జీవనోపాధి కోసం కువైట్ కు వెళ్ళిందని అక్కడ గ్రామస్తులు అధికారులకు తెలిపారు. ఈ విషయం తమ దృష్టికి ఇదివరకే వచ్చిందని, తన ఉద్యోగానికి రాజీనామా చేయకుండా కువైట్‌కి వెళ్ళిన ఆయా జీతభత్యాలను గత ఏడాది ఆగస్టు నుంచి నిలిపివేశామన్నారు. ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేయకుండా వెళ్లిందని ఆ విషయాన్ని తమ నివేదికల్లో ఇదివరకే పొందుపరిచామన్నారు. తమ విచారణలో గ్రామస్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, సెంటర్ సక్రమంగా జరుగుతుందని టీచర్ సక్రమంగా బడికి వస్తుందని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చారని సిడిపిఓ రాజమ్మ, సూపర్వైజర్ తులశమ్మ లు పాత్రికేయుల ఎదుట పేర్కొన్నారు.







**అంగన్వాడి సిబ్బంది పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోం.**

**ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు నాగేశ్వరి హెచ్చరిక**

సోషల్ మీడియా ద్వారా అంగన్వాడి సిబ్బంది పై అసత్య ప్రచారాలు చేయడంతో పాటు బ్లాక్ మెయిల్ పాల్పడడం, బెదిరింపులకు దిగుతున్న ఐటిడిపి వీరబల్లి మండల అధ్యక్షుడు కాల్వపల్లి వెంకటరమణ తోపాటు అతనికి సహకరిస్తున్న మరికొందరి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు నాగేశ్వరి డిమాండ్ చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన అసత్య వార్తలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ ల దృష్టికి తీసుకెళ్లినా కూడా సోషల్ మీడియాలో అదే వ్యక్తులు తిరిగి అసత్య ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు. అంగన్వాడిల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎంతవరకైనా వెళ్లి పోరాడుతామని ఆమె హెచ్చరించారు. అంగన్వాడీ కార్యకర్తలను బ్లాక్ మెయిల్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న ఐటీడీపీ నాయకుల పై టిడిపి అధిష్టానం దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# బీసీ సంక్షేమ వసతి గృహం మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**- ఏఐఎస్‌పిరాష్ట్ర అధ్యక్షులు తుమ్మల లవకుమార్**

**- వీరబల్లి ఎంపీడీవో జవహర్ బాబుకు వినతి**




**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం వీరబల్లి మండల పరిధిలో ఉండే బీసీ సంక్షేమ వసతి గృహాన్ని మూసివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ ఏఐఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల లవ కుమార్ వీరబల్లి మండలం ఎంపీడీవో జవహర్ బాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1987వ సంవత్సరంలో ఏర్పాటుచేసిన ఈ వసతిగృహాన్ని అప్పటినుండి ఇప్పటివరకు దాదాపు వేలమంది విద్యార్థిని విద్యార్థులకు ఆసరాగా నిలవడం జరిగింది. విద్యను అభ్యసించే దానికి అవకాశం కల్పించింది. విద్యార్థులు లేరనే సాకుతో వసతి గృహాన్ని మూసివేసే ఆలోచనలను ఈ రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని వారు కోరారు. ఉన్నఫలంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవడం వల్ల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారు అవుతుందన్నారు. గతంలో వీరబల్లి మండలంలో సోషల్ వెల్ఫేర్ వసతి గృహం, మట్లి బీసీ సంక్షేమ వసతిగృహం ఉన్నాయి, వాటిని కూడా మూసి వేయడం జరిగింది. ఆ కోవలోనే ఇప్పుడు ప్రస్తుతం ఉన్న వసతి గృహాన్ని కూడా చేర్చాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పేద మధ్యతరగతి విద్యార్థులకు ఆసరాగా ఉన్న ఈ ఒక్క దాన్ని కూడా లేకుండా చేయాలని ఆలోచన మానుకోవాలన్నారు. నూతన అడ్మిషన్లకు అవకాశం కల్పించి కొత్త అప్లికేషన్లు తీసుకోవాలని విద్యార్థి సంఘంగా మేము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. వీరబల్లి ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాన్ని మూసివేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ (ఏఐఎస్‌పి) తీవ్రంగా ఖండిస్తోంది. పేద, గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఆశాకిరణంగా నిలిచిన ఈ వసతి గృహాన్ని మూసివేయడం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యక్ష దాడి చేయడమే అన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం, ఉన్న వసతి గృహాలనే మూసివేయడం అత్యంత బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకొని, వసతి గృహాన్ని యథావిధిగా కొనసా గించడంతో పాటు అవసరమైన వసతులను కల్పించాలని మేము గట్టిగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే, విద్యార్థులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి ఏఐఎస్‌పి వెనుకాడదని స్పష్టం చేస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిట్లూరు వెంకటరమణ పాల్గొన్నారు

### ఆగస్టు 22వ తేదీన అనంతపురంలో

# పార్టీ ప్లీనరి సమావేశాలకు అన్ని పార్టీలకు పిలుపు

**- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షులు కుంచం. వెంకటసుబ్బారెడ్డి**



**కడప – సూర్యవాస్తవం :** అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలూరు, కృష్ణగిరి, బళ్ళారి, రాయచూరు, చిత్రదుర్గ, కోలార్‌తో కలిపి జిల్లాతో ప్రత్యేక రాయల సీమ ఏర్పాటు సాధనకై పోరాటం చేస్తున్న రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ ప్లీనరీ సమావేశాలు ఆగష్టు 22 వ తేదీన నిర్వహించనున్న ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. అనంతపురం శ్రీ కృష్ణ దేవరాయ సభా ప్రాంగ ణంలో జరిగే ఈ కార్యక్రమంలో మేధావులు, విద్యా వంతులు పోరాటసూరులైన సీమ బిడ్డలు సీమ సాధన కోసం పిడికిలి బిగించి తరతరాల రాయలసీమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను చాటేందుకు తరలి రావాలని కోరారు. ఈ ప్లీనరీ సమావేశాలలో సీమకు రావలసిన, కావాల్సిన అనేక విషయాలను చర్చించు కుందామని పిలుపు ఇచ్చారు. పార్టీ సమావేశాలలో రాయలసీమ కోసం సీమ సింహాలను నిద్రలేపి ఒక ఉప్పెన రూపంగా ఉద్యమాన్ని ముందుకు నడుపుతూ సీమ ప్రజా ప్రతినిధులకు బుద్ధి చెప్పాల్సిన వేదిక ఈ సమావేశాలలో సీమ బిడ్డల మైన మనం అందరం పాల్గొని మన భావితరాలవారి జీవితాలను బంగారు మయం చేసుకోవాలన దానికి, మన ప్రాంతాన్ని, మన సంస్కృతి సాంప్రదాయా లను రక్షించుకోవడానికి రండి ఉద్య మించండని తెలి పారు. 1951 అప్పటి మద్రాసు రాష్ట్రంలో ఉన్నటువంటి కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలురు, కృష్ణగిరి, బళ్ళారి, రాయచూరు, చిత్ర దుర్గ మరియు కోలార్ తో కలిపి 12 జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ ప్రాంతంగా ఆమోదించి తీర్మాణము చేసి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కార్యాచరణ ప్రణాళిక గురించి చర్చించడం, పార్లమెంట్లో ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కోసం ఆర్టికల్ 3 ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజల గుండె చప్పుడు ప్రత్యేక రాయలసీమ, దీన్ని రాజ్యాంగ బద్ధంగా ఎలా సాధించాలి పై చర్చించడం. సీమ సంస్కృతి సాంప్రదాయాలైన ఉత్సవాలను, జాత రలను ప్రభు త్వమే ఘనంగా జరిపించాలి. అలాగే స్వాతంత్రోద్యమ నాయకుల వర్ధంతి, జయంతులను ప్రభుత్వమే నిర్వహించాలి, వాటి స్మారకాలను ప్రభుత్వ అభివృద్ధి చేయడంపై చర్చించడం. సీమ దళిత బంధు, రైతుబంధు పేరుతో ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షలు కేటాయించడంపై చర్చించడం. తెలుగు విశ్వ విద్యాలయాన్ని సీమ లో స్థాపించడం, రాయలసీమ విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక నిధులు రాబట్టడం గురించి చర్చించడం. తిరుపతి తిరుమల దేవస్థానంలో రాయలసీమ యువతీ యువకులకే ఎక్కువ భాగం ఉద్యోగ అవకాశాలు కల్పించడం, దేవస్థాన నిధులను సీమకు కేటాయిండంపై చర్చించడం. రైతులకు ప్రత్యేక ప్యాకేజిని ఏర్పాటు చేసి రైతు ధాన్యాన్ని నేరుగా రైతు అమ్ముకునే విధంగా ఏర్పాటు చేయడం పై చర్చ. రాయలసీమలోని అన్ని పరిశ్రమలలో సీమవాసులనే 80శాతం ఉద్యోగులుగా నియమించుకోవడం పై చర్చ. ప్రస్తుతం రాయలసీమలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులన్నింటిని ఏ విధంగా త్వరతగిన పూర్తి చేయించుకోవాలి అనే అంశంపై చర్చ. రాయలసీమలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు పై చర్చ. రాయలసీమ లోని ప్రతి జిల్లాకు ఒక సాఫ్ట్వేర్ కారిడార్లు ఏర్పాటు గురించి చర్చ.సి.పి.యస్. రద్దు చేయాలి. రాయలసీమకు లక్షల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి.గుంతకట్లు రైల్వేజోన్గా ప్రకటించాలి. రాయలసీమ ప్రాంతాలను పారిశ్రామిక కారిడార్గా ఏర్పాటు చేయాలి దీనివల్ల వెనుకబడిన రాయలసీమ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలతో పాటు భూముల విలువలు కూడా పెరుగుతాయన్నారు.

# బ్యాక్ టు బ్యాక్ భారీ ప్రాజెక్టులు

# 'జై హనుమాన్' తర్వాత 'ఛత్రపతి శివాజీ మహారాజ్'గా రిషబ్ శెట్టి!

- పుట్టినరోజు సందర్భంగా 'కాంతార' ఫ్రాంచైజీ తదుపరి చిత్రంపై రిషబ్ శెట్టి స్పష్టత
- 'కాంతార: చాప్టర్ 2' కోసం రచయితల బృందంతో కలిసి కథా చర్చలు ప్రారంభం
- రెండు చిత్రాల కోసం ప్రత్యేకమైన మేకోవర్స్ మార్చనున్న కన్నడ స్టార్
- 'ది ప్రైడ్ ఆఫ్ భారత్' చిత్రంలో ఔరంగజేబుగా నటిస్తున్న వివేక్ ఒబెరాయ్



కన్నడ స్టార్, జాతీయ అవార్డ్ విజేత రిషబ్ శెట్టి తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్స్ ఇచ్చాడు. 'కాంతార' సినిమాతో సంచలన విజయం అందుకున్న ఈ నటదర్శకుడు.. ఈ ఫ్రాంచైజీలో రాబోయే తదుపరి భాగం గురించి ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'కాంతార: చాప్టర్ 2' కోసం తన రచయితల బృందంతో కలిసి పని ప్రారంభించినట్లు ఆయన స్పష్టం చేశాడు.దర్శకత్వంపై తనకున్న అమితమైన ఇష్టాన్ని వివరిస్తూ.. "నేను ఖాళీగా కూర్చోలేను, నా డైరెక్షన్ వర్క్ నేను చేసుకోకపోతే నాకు మనశ్శాంతి ఉండదు. నా దర్శకత్వ బాధ్యతలు నాకు ఎంతో సంతోషాన్ని, ప్రశాంతతను ఇస్తాయి. ప్రస్తుతం నా రైటర్స్ టీమ్‌తో కలిసి 'కాంతార: చాప్టర్ 2' స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నాను" అని రిషబ్ శెట్టి వెల్లడించారు.

### బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులు

కేవలం 'కాంతార' మాత్రమే కాకుండా భవిష్యత్తులో తాను నటించబోయే రెండు క్రేజీ చిత్రాల గురించి కూడా రిషబ్ క్లారిటీ ఇచ్చారు. "నాకు బ్యాక్ టు బ్యాక్ రెండు పెద్ద సినిమాలు లైన్లో ఉన్నాయి. నేను ఒకేసారి రెండు సినిమాల షూటింగ్స్ చేయలేను. అందుకే మొదట ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రాబోయే 'జై హనుమాన్' సినిమా పూర్తి చేస్తాను. ఆ తర్వాతే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. ఈ రెండు చిత్రాల కోసం నేను పూర్తిగా భిన్నమైన రూపాల్లో కనిపించాల్సి ఉంది" అని చెప్పాడు.


### వివేక్ ఒబెరాయ్ ఎమోషనల్ పోస్ట్

రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే 'ది ప్రైడ్ ఆఫ్ భారత్' సినిమాలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో నటిస్తూ రిషబ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్న బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. "సినిమా అనేది ఒక అద్దం లాంటిది, కానీ రిషబ్ శెట్టి సినిమా ఒక సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే పోర్టల్ లాంటిది. మట్టి, నిప్పు, హద్దులు దాటిన నీ విజన్‌తో నువ్వు సినిమా రూల్స్‌నే మార్చేశావు బ్రదర్. ప్రతి పనిలోనూ రక్తాన్ని, చెమటను చిందించే మాస్టర్ క్రాఫ్ట్స్‌మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు. నీతో కలిసి త్వరలోనే ఒక ఎపిక్ వండర్‌ను స్క్రీన్‌పై క్రియేట్ చేయడానికి నేను ఎంతగానో ఎదురుచూస్తున్నాను" అంటూ వివేక్ ఒబెరాయ్ ప్రశంసల జల్లు కురిపించాడు.

## 'కలర్స్' స్వాతి రెండో పెళ్లి..

# తన డైరెక్టర్‌తోనే ఏడడుగులు!

- నటి స్వాతిని వివాహం చేసుకున్న దర్శకుడు శ్రీకాంత్ నాగోతి



'కలర్స్' స్వాతిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి స్వాతి రెడ్డి తన జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించారు. దర్శకుడు శ్రీకాంత్ నాగోతిని ఆమె వివాహం చేసుకున్నారు. అత్యంత సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా జరిగిన ఈ వివాహ వేడుకకు సంబంధించిన విశేషాలను ఈ జంట బుధవారం సోషల్ మీడియా వేదికగా ఫొటోలతో సహా అధికారికంగా ప్రకటించింది.తమ పెళ్లి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోగా, ఈ వార్త తెలిసిన వెంటనే చిత్ర పరిశ్రమ ప్రముఖులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 'మంత్ ఆఫ్ మధు' చిత్రంలో ఆమె సహనటుడు నవీన్ చంద్ర "బ్రో కంగ్రాచ్యులేషన్స్" అంటూ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు.శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో 2023లో విడుదలైన 'మంత్ ఆఫ్ మధు' చిత్రంలో స్వాతి కథానాయికగా నటించారు. కొంత విరామం తర్వాత ఆమె నటించిన ఈ చిత్రం, ముఖ్యంగా ఓటీటీ వేదికగా మంచి ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి, నేడు వైవాహిక బంధానికి దారితీసింది.




# 'టాక్సిక్' నుంచి తొలి పాట విడుదల

**- యశ్ 'టాక్సిక్' నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల- ఆకట్టుకుంటున్న యశ్, కియారా అద్వానీల ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ - గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో భారీ తారాగణం- ఆగస్టు 26న సినిమా ప్రపంచవ్యాప్త విడుదల**

యశ్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్' నుంచి 'తబాహి' పేరుతో తొలి వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.పాటలో యశ్, కియారాల జోడీ, వారి మధ్య చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. విజువల్స్ పరంగా పాట బాగుందని చెప్పుచ్చు. ఈ పాట తెలుగు వెర్షన్‌కు ప్రముఖ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు.గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి భారీ తారాగణం నటిస్తోంది. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై యశ్ స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# కొడుకు కోసం సినిమాల ఎంపికను మార్చుకున్న కాజల్ అగర్వాల్!



స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. అయితే తల్లి అయిన తర్వాత సినిమాల ఎంపికలో తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని ఆమె తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ'తో పాటు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'రామాయణ' షూటింగ్‌లతో బిజీగా ఉన్న కాజల్... తన కొడుకు నీల్ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వంగా చెప్పుకునేలా ఉండే స్క్రిప్ట్‌లను ఎంచుకుంటున్నట్లు తెలిపింది. కమర్షియల్ అంశాల కంటే బలమైన పాత్రలు, సందేశాత్మక చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పింది.



# టీ20 ర్యాంకింగ్స్: టాప్‌లోనే ఇషాన్, అభిషేక్..

# భారీగా మెరుగుపడ్డ ఇంగ్లండ్ ఆటగాళ్ల ర్యాంకులు

**- భారీగా మెరుగుపడ్డ ఇంగ్లండ్ ఆటగాళ్ల ర్యాంకింగ్స్-ఎనిమిదో ర్యాంక్‌కు చేరిన జేకబ్ బెతెల్ -మూడు విభాగాల్లోనూ పురోగతి సాధించిన సామ్ కరన్-425 స్థానాలు ఎగబాకిన శ్రేయస్ అయ్యర్ ఇంగ్లండ్‌కు కలిసొచ్చిన భారత్‌పై విజయాలు**



తాజా ఐసీసీ పురుషుల టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ తమ తొలి రెండు స్థానాలను నిలబెట్టుకున్నారు. మరోవైపు ఇంగ్లండ్ ఆటగాళ్ల ర్యాంకుల భారీగా మెరుపడడం గమనార్హం. భారత్‌తో ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేయడం వారికి కలిసొచ్చింది.భారత్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఆ తర్వాత ఇంగ్లండ్ వరుస విజయాలు సాధించింది. మూడో టీ20లో 125 పరుగుల భారీ తేడాతో గెలిచి టీ20ల్లో భారత్‌కు అతిపెద్ద ఓటమిని మిగిల్చింది. ఈ ప్రదర్శన ప్రభావం తాజా ర్యాంకింగ్స్‌లో స్పష్టంగా కనిపించింది.రెండో టీ20లో 46 బంతుల్లో అజేయంగా 76 పరుగులు చేసిన జేకబ్ బెతెల్ ఏకంగా ఏడు స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంక్‌కు చేరాడు. సామ్ కరన్ మూడు విభాగాల్లోనూ తన స్థానాన్ని మెరుగు పర్చుకున్నాడు. రెండో మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టిన అతడు, మూడో మ్యాచ్‌లో అజేయంగా 41 పరుగులు చేశాడు. దీంతో బ్యాటింగ్‌లో 12 స్థానాలు ఎగబాకి 108వ ర్యాంక్‌కు చేరాడు. బౌలింగ్‌లో 12 స్థానాలు మెరుగుపరుచుకుని 71వ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.లెగ్‌స్పిన్నర్ ఆదిల్ రషీద్ ఒక స్థానం మెరుగుపరుచుకుని బౌలర్ల జాబితాలో మూడో ర్యాంక్‌ను అందుకున్నాడు. మూడో టీ20లో 2 వికెట్లతో మెరిసిన ఫలితం అతడికి ఉపయోగపడింది. కేవలం రెండో టీ20 ఆడిన జోష్ టంగ్ నాలుగు వికెట్లు తీసి 301వ ర్యాంక్‌లో నిలిచాడు. విల్ జాక్స్ కూడా ఆల్‌రౌండర్ల జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు.భారత్‌కు సిరీస్ ఆశించినట్టు సాగకపోయినా కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు మంచి పురోగతి లభించింది. తొలి మ్యాచ్‌లో 68 పరుగులు, రెండో మ్యాచ్‌లో 37 పరుగులు చేయడంతో ఏకంగా 425 స్థానాలు ఎగబాకి 93వ ర్యాంక్‌కు చేరాడు.టెస్టు ర్యాంకింగ్స్‌లో శ్రీలంక ఓపెనర్ లహిరు ఉదారా 188 పరుగుల ఇన్నింగ్స్‌తో 52 స్థానాలు ఎగబాకి 85వ ర్యాంక్‌కు చేరాడు. కమిందు మెండిస్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. అసిత ఫెర్నాండో ఐదు వికెట్ల ప్రదర్శనతో బౌలర్ల జాబితాలో 20వ స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ బ్యాటర్ జస్టిన్ గ్రీవ్స్ 180 పరుగుల ఇన్నింగ్స్‌తో 14 స్థానాలు ఎగబాకి 49వ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. షాయ్ హోప్ సెంచరీతో ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని 51వ ర్యాంక్‌లో నిలిచాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. బంగ్లాదేశ్ పేసర్ నహీద్ రాణా 6/21 గణాంకాలతో 17 స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌కు చేరాడు. జింబాబ్వే బౌలర్లు రిచర్డ్ నగరవా 19వ ర్యాంక్‌కు చేరగా, బ్రాడ్ ఎవాన్స్ 111వ స్థానానికి చేరాడు. బ్లెస్సింగ్ ముజరబాని కూడా 17 స్థానాలు మెరుగుపరుచుకుని 33వ ర్యాంక్‌లో నిలిచాడు.



# టీమిండియా ఫామ్‌పై గంగూలీ ఆశ్చర్యం..

## కచ్చితంగా పుంజుకుంటుందంటూ ధీమా

**ప్రతి గొప్ప జట్టుకు ఇలాంటి క్లిష్ట పరిస్థితులు వస్తాయని వ్యాఖ్య**
**జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లు చాలామంది ఉన్నారన్న దాదా**
**భారత్ తప్పకుండా పుంజుకుంటుందని ధీమా**
**సంజూను పక్కనపెట్టడంపై వ్యాఖ్యానించనన్న మాజీ కెప్టెన్**

టీమిండియా వరుస పరాజయాలపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇటీవల వైట్‌బాల్ క్రికెట్‌లో జట్టు ఆశించిన స్థాయిలో ఆడకపోవడం ఊహించలేదన్నారు. అయితే ఇది తాత్కాలికమేనని, భారత జట్టు తప్పకుండా మళ్లీ విజయాల బాట పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంపై మాత్రం స్పందించేందుకు నిరాకరించారు.తన 54వ జన్మదిన వేడుకల సందర్భంగా మీడియాతో మాట్లాడిన గంగూలీ.. ఇటీవల టీమిండియా ప్రదర్శన ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. వైట్‌బాల్ క్రికెట్‌లో భారత్ ఎప్పుడూ బలమైన జట్టేనని గుర్తు చేశారు. ప్రస్తుతం కనిపిస్తున్న ఫామ్ సమస్య తాత్కాలికమేనని అభిప్రాయపడ్డారు.ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ 0-2తో వెనుకబడినా ఆందోళన అవసరం లేదన్నారు. జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లు చాలామంది ఉన్నారని చెప్పారు. సిరీస్‌ను సమం చేయడమే ఇప్పుడు జట్టు ముందున్న లక్ష్యమన్నారు. ప్రతి గొప్ప జట్టుకు ఇలాంటి క్లిష్ట పరిస్థితులు వస్తాయని, వాటి నుంచి బయటపడే సత్తా కూడా భారత జట్టుకు ఉందని పేర్కొన్నారు.రెండో టీ20లో సంజూ శాంసన్‌ను పక్కన పెట్టి యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వడంపై ప్రశ్నించగా గంగూలీ జాగ్రత్తగా స్పందించారు. తుది జట్టు ఎంపిక పూర్తిగా టీమ్ మేనేజ్‌మెంట్ పరిధిలోని విషయమని చెప్పారు. ఆ నిర్ణయంపై తాను వ్యాఖ్యానించడం సరికాదన్నారు.

# కారుణ్య మరణాలకు ఇక మార్గం సుగమం

- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు చర్యలు
- మార్గదర్శకాలను ఆమోదించిన మంత్రి సత్య కుమార్ యాదవ్
- వైద్యులు, రోగుల కుటుంబ సభ్యుల నిర్ణయాలకు చట్ట బద్ధత
- అంతిమ దశలో ఉన్న రోగులకు ఊరట




**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** తీవ్రమైన వ్యాధులకు గురై, చికిత్సకు లొంగని స్థితిలో,వెంటిలేటర్ సహా యంతో ఊపిరి పీల్చుకుంటూ, మరణానికి చేరువై నరక యాతనను అనుభవించే రోగులకు ఊరట కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన నిర్ణయాన్ని తీసుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాలకనుగుణంగా అటువంటి వారికి కారుణ్య మరణం లభించేలా విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది.వ్యాధి నుంచి కోలుకునే అవకాశం ఏమాత్రమూ లేక చికిత్సల పేరిట నానా ఇబ్బందులు పడే వారికి ఈ నిర్ణయం ఎంతో ఊరట కల్పించ నుంది. గౌరవప్రద మరణం పౌరుల ప్రాథమిక హక్కు భారత రాజ్యాంగంలోని 21వ అధికరణ కింద గౌరవ ప్రదమైన మరణం పౌరుల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు ఇందుకు సంబంధించి 2018లో" కామన్ కాజ్"అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన రిట్ పిటిషన్ లో ఇచ్చిన తీర్పునకు జనవరి, 2023లో కొన్ని సవరణలు చేసింది. అంతకు ముందు అవసాన దశలో ఉన్న వారికి వైద్యులందించే లైఫ్ సపోర్ట్ సిస్టంను (వెంటిలేటర్ సపోర్ట్ వంటివి) తొలగించేందుకు సంబంధించి ఎటువంటి చట్టపరమైన నిబంధనలు లేకపోవడంతో ఆసుపత్రులు, వైద్యులు,రోగుల కుటుంబాలకు పలు చిక్కులు ఎదురయ్యే పరిస్థితి ఉండేది.దీని కారణంగా చకిత్స నిష్ప్రయోజనమని తెలిసినా కృత్రిమంగా రోగులు ఊపిరి పీల్చుకుంటూ పలు కష్టనష్టాలకు గురయ్యేవారు. కారుణ్య మరణాలకు మార్గదర్శకాలు, అవసాన దశలో ఉన్న రోగులకు సహజ రీతిలో కారుణ్య మరణాల అవకాశాలను కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా రూపొందించిన మార్గదర్శకాలను వైద్యారోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి బుధవారంనాడు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా రోగుల స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవిస్తూ చికిత్సనందించే వైద్యులు,కారుణ్య మరణాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే రోగుల కుటుంబీకులకు చట్ట పరమైన రక్షణ లభిస్తుంది. ఎటువంటి అవకతవకలకు వీలులేకుండా ఈ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయడానికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్,డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ మరియు జిల్లా స్థాయి డిఎంహెచ్వోలను ప్రభుత్వం బాధ్యులను చేసింది.

"ప్రధాన మార్గదర్శకాలు":-1) వ్యాధితో బాధపడుతున్న రోగి ఎటువంటి నిర్బంధానికి గురికాకుండా,పూర్తి చేతనావస్థలో ఉండి, స్వతంత్రంగా,ఇద్దరు సాక్షుల సమక్షంలో ఇక ముందు తనకందించాల్సిన చికిత్సపై పరిస్థితులకనుగుణంగా తగు నిర్ణయం తీసుకునే గార్డియన్‌ను సూచిస్తూ సంతకంతో కూడిన"ఎడ్వాన్స్ డైరెక్టివ్"ని రూపొందించవచ్చు.దీనిని నోటరీ లేదా గజిటెడ్ అధికారి ధ్రువీకరించాలి. 2) చికిత్సకు లొంగక అవసాన దశకు చేరిన రోగి పరిస్థితిని చికిత్సనందిస్తున్న వైద్యులు పరీక్షించి ఎడ్వాన్స్ డైరెక్టివ్ లో పొందుపరచిన నిర్ణయాన్ని అందులో సూచించిన గార్డియన్ కు తెలియజేసి, కొన సాగుతున్న చికిత్సను ఆపివేయడం ఉత్తమమని వైద్యుడు నిర్ణయానికొస్తే ఆ సంగతి గార్డియన్‌కు వివరించాలి. ఇతరుల విషయంలో చికిత్సను ప్రారంభించడం నిష్ప్రయోజమని భావిస్తే ఆ విషయాన్ని గార్డియన్‌కు తెలపాలి. 3) అట్టి పరిస్థితుల్లో చికిత్సనందిస్తున్న ఆసుపత్రివారు అవసాన దశలో ఉన్న రోగి పరిస్థితిని పరిశీలించేందుకు,చికిత్సనందిస్తున్న వైద్యునితో పాటు 5 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన మరో ఇద్దరు వైద్యులతో ప్రైమరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి 48 గంటల్లో ప్రాథమిక నిర్ణయాన్ని తీసుకోవాలి. 4) రోగికి చికిత్సనందించడం నిష్ప్రయోజనమని ప్రైమరీ మెడికల్ బోర్డు భావిస్తే సదరు వైద్యుడు,డిఎంహెచ్ఓ మరియు చికిత్సతో సంబంధంలేని మరో ఇద్దరు వైద్యులతో కూడిన సెకండరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలి.

5) ఈ రెండు మెడికల్ బోర్డుల అభిప్రాయాలను, గార్డియన్ సమ్మతిని ఆసుపత్రివారు చికిత్సను ఆపివేసే ముందు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు తెలియజేయాలి. 6) సెకండరీ మెడికల్ బోర్డు రోగికి చికిత్సను ఆపివేయడానికి అంగీకరించనపుడు రోగి సూచించిన గార్డియన్ హైకోర్టును ఆశ్రయించవచ్చు.హైకోర్టు 20 ఏళ్ల అనుభవంగల వైద్యులతో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేస్తుంది."అనుకోని పరిస్థితుల్లో"...

7) అవసాన దశలో ఉన్న రోగి ముందస్తుగా "ఎడ్వాన్స్‌డ్ డైరెక్టివ్"ను ఇవ్వని పరిస్థితుల్లో రోగి పరిస్థితిని సంబంధిత డాక్టర్ ఆసుపత్రివారికి తెలియజేస్తే,వారు ప్రైమరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి రోగి సంబంధించిన వారితో చికిత్సను ఆపివేయడం లేక ప్రారంభించకపోవడం వలన కలిగే పరిణామాలను క్షుణ్ణంగా వివరించి వాటిని రాతపూర్వకంగా పొందుపరు స్తారు. అనంతరం సెకండరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేస్తారు. భిన్నాభిప్రాయాలు ఎదురైతే రోగి సంబంధీకులు హైకోర్టును ఆశ్రయించవచ్చు. 8) చివరిగా రోగికి లైఫ్ సపోర్టును తొలగిస్తే ఆ సంగతిని సంబంధిత మేజిస్ట్రేట్ హైకోర్టుకు తెలియపర్చాలి. 9) ఈ ప్రక్రియకు సంబంధించిన రికార్డుల్ని రోగి మరణానంతరం మూడేళ్ల వరకు భద్రపర్చాలి. కారుణ్య మరణాలకు వీలు కల్పించే ఈ ప్రక్రియను అత్యంత పటిష్టంగా పర్యవేక్షించాలని, ఏ దశలోనూ పొరపాటు జరక్కుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశించారు.

# మహానేత వైఎస్సార్ ఆశయాలే ప్రజాసేవకు మార్గదర్శకం

- ఘనంగా వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు
- వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- కేక్ కటింగ్, అన్నదానం.. పెద్ద ఎత్తున పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు
- రైతు, పేదల సంక్షేమానికి వైఎస్సార్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడిన కిలివేటి



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, రైతు బాంధవుడు, పేదల పెన్నిధి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా నాయుడుపేట పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడుపేట పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో పాటు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి తన రాజకీయ జీవితాన్ని పూర్తిగా ప్రజా సేవకే అంకితం చేసిన మహానేత అని కొనియాడారు. రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని వ్యవసాయ రంగానికి కొత్త దిశను చూపారని పేర్కొన్నారు.

ఆయన అమలు చేసిన పథకాల ఫలితంగా లక్షలాది మంది రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తంబీరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరీ పాలూరు దశరథ రామిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దాలి సోమశేఖర్ రెడ్డి, నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు కలికి మాధవ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబీరెడ్డి జనార్దన్ రెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడు కట్టా భవాని శంకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, మహిళా నాయకురాలు ఈదా రత్నశ్రీ, ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, మండల వైస్ ప్రెసిడెంట్ బైనా మల్లికార్జున్ రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భావన్ అనుదీప్‌తో పాటు నాగిరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, పేట చంద్రారెడ్డి, నల్లూరు ప్రకాష్, గంధవల్లి సిద్దయ్య, మేనకూరు చంద్ర, మెస్ భాస్కర్ రెడ్డి, షేక్ రహమతుల్లా, పేర్నాటి రాహుల్, రమణయ్య, శేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్య్ర కమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనగా, మహా నేతకు ఘన నివాళులు అర్పిస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలనే సంకల్పాన్ని పార్టీ శ్రేణులు వ్యక్తం చేశాయి. కార్యక్రమం మొత్తం వైఎస్సార్ నినాదాలు, జైజై ధ్వానాలతో ఉత్సాహభరితంగా సాగింది.

# పీఎం శ్రీ మార్గదర్శకాలకు అనుగుణంగా సౌకర్యాలు ఉండాలి

**- "మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ నాయుడు "**

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** ఆదర్శ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల వసతి సౌకర్యాలు,బోధన ఏర్పాట్లు పీఎం శ్రీ 21 మార్గదర్శకాల ప్రకారం ఉండాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ నాయుడు సూచించారు. ఆయన బుధవారం దొరవారిసత్రం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బీసీ గురుకులంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనను తిరుపతయ్య,సిబ్బంది గౌరవప్రదంగా పూల బొకేతో ఆహ్వానం పలికారు. గురుకులంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. విద్యా ర్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. అదేవిధంగా ఆవరణంలోనే ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ తనిఖీ చేశారు. విద్యార్థుల క్రమశిక్షణ,బోధన వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం మండల పరిధిలోని మావిళ్ళ పాడు ఆదర్శ పాఠశాలను సందర్శించారు.అక్కడ ప్రధాన మంత్రి రైసింగ్ ఇండియా స్కీమ్ నిధులతో అభివృద్ధి పనులైన క్రీడా మైదానం,కిచెన్ గార్డెన్, స్కౌట్స్ అండ్ గైడ్,




ఒకేషనల్ ల్యాబ్‌తో పాటు,పలు రకాల ల్యాబ్లను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు. పీఎంశ్రీ పాఠశాలలోని విద్యార్థులు చదువుతోపాటు,అన్ని రంగాల్లో మిగిలిన పాఠశాలలకు భిన్నంగా ఉండాలని సూచించారు. పీఎం శ్రీ 21 మార్గదర్శకాల మేరకు కొనసాగుతున్నందుకు దొరవారిసత్రం ప్రిన్సిపాల్ తిరుపతయ్య, మావిళ్ళపాడు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమలత, సహకరిస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. విద్యార్థులతో కొంత సమయాన్ని కేటాయించి పాఠశాల బోధన, వసతి సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యత గురించి ఆరా తీశారు.ఏ కొత్త కార్యక్రమం చేపట్టిన విజువల్ రికార్డు పూర్వకంగా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (2) కృష్ణయ్య, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

### అభివృద్ధి పథకాలు సంక్షేమ కార్యక్రమాలు

# ప్రజల్లోకి విస్తృతంగా చేరవేయాలి

### - మంత్రి సత్య కుమార్





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత విస్తృత చేరవేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు ఆయన బుధవారం, విజయవాడలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు,మీడియా కార్యకర్తల శిక్షణా శిబిరంలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ, మారుతున్న మీడియా పరిస్థితులు,డిజిటల్ కమ్యూనికేషన్‌లో వస్తున్న మార్పులు,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాల్సిన అవసరంపై చర్చించారు. అలాగే గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రి సత్య కుమార్ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.సమకాలీన రాజకీయ పరిణా మాలు, మీడియా నిర్వహణ, సామాజిక మాధ్యమాల సమర్థవంతమైన వినియోగం, ప్రజలకు వాస్తవాలను బాధ్యతాయుతంగా చేరవేసే విధానాలపై నిర్వహించిన చర్చల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# పీఎంశ్రీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

### - కేంద్ర బృందం పర్యటనకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశం

### -నిధుల వినియోగం నుంచి భద్రతా ఏర్పాట్ల వరకు సమగ్ర పరిశీలన



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన తల్వాయపాడు ప్రభుత్వ పాఠశాలలో సమగ్ర శిక్ష తిరుపతి జిల్లా బృందం బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వినియోగం, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో కేంద్ర బృందం పాఠశాలను సందర్శించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. ఏఎంఓ ఆధ్వర్యంలో వచ్చిన జిల్లా బృందం పీఎంశ్రీ పథకం కింద మంజూరైన ప్రతి అంశాన్ని పరిశీలించింది. కాంపోజిట్ గ్రాంట్ నిధుల వినియోగం, పాఠశాల అభివృద్ధి పనులు, 'నో బ్యాగ్ డే' అమలు, జాతీయ పండుగల నిర్వహణ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు, పీఎంశ్రీ స్కూల్ రివ్యూ రిపోర్ట్--21తో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. నిధుల వినియోగంలో పారదర్శకతతో పాటు ప్రతి కార్యక్రమం నాణ్యతతో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్వరలో కేంద్ర స్థాయి పరిశీలనా బృందం పాఠశాలను సందర్శించనున్నందున అవసరమైన అన్ని రికార్డులు, దస్త్రాలు, పథకాల అమలు వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించి సిద్ధంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పీఎంశ్రీ పథకం లక్ష్యాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మండల విద్యాశాఖాధికారి ఎం. శంకరయ్య మాట్లాడుతూ పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేస్తూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందేలా కార్యక్రమాలు చేపట్టాలని, జాతీయ పండుగలను దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించాలని తెలిపారు. జాయ్‌ఫుల్ లెర్నింగ్‌లో భాగమైన 'నో బ్యాగ్ డే'ను సృజనాత్మకంగా అమలు చేసి విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా ఏర్పాట్లను జిల్లా బృందం పరిశీలించింది. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఉపాధ్యాయులు జానీత తదితరులు పాల్గొని పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాల వివరాలను జిల్లా అధికారులకు వివరించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు రెండో రోజు విస్తృత పర్యటన

**- అంగన్‌వాడీలు, పీహెచ్‌సీలు, పాఠశాలలు, రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్ల తనిఖీ**
**- చిన్నమండెం ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం బస్తాల తూకంలో భారీ వ్యత్యాసంపై ఆగ్రహం**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజమల దేవి అన్నమయ్య జిల్లాలో రెండో రోజు కూడా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), ప్రభుత్వ మరియు సంక్షేమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు (ఎఫ్‌పీఎస్‌లు), ఎంఎల్ఎస్ పాయిం ట్లను తనిఖీ చేసి అక్కడ అందుతున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు.

**కురబలకోట మండలం**

కురబలకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సభ్యురాలు వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం కురబలకోట--2, కురబలకోట--4 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం, సేవలను పరిశీలించారు. ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యా సౌకర్యాలను పరిశీలించారు. ముదివీడు గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థినుల వసతి, విద్యా సౌకర్యాలను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు ఎఫ్‌పీఎస్ నెం. 1006002, 1006001లను తనిఖీ చేసి సరుకుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు.



గుర్రంకొండలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన సభ్యురాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజనం నాణ్యత ఎంతో బాగుందని పేర్కొంటూ సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు.

**చిన్నమండెం మండలం**

చిన్నమండెంలోని ఏపీ మోడల్ స్కూల్ (బాలికలు)ను సందర్శించి విద్యార్థినుల వసతి గృహాలు, స్టోర్‌రూమ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని గోదాం, ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి నిల్వలు, నిర్వహణ, పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాలను తూకం వేయగా 50 కిలోల బదులు 40 నుంచి 42 కిలోల బరువు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో బస్తాలో సుమారు 8 నుంచి 10 కిలోల వరకు బియ్యం తక్కువగా ఉన్నట్లు తేలడంతో అక్కడి సిబ్బందితో పాటు జిల్లా పౌర సరఫరాల కార్పొరేషన్ డి ఎం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు గౌరవ సభ్యురాలికి వెంట ఉండి వివిధ సంక్షేమ పథకాల అమలు, ఆహార భద్రత, విద్యా, పోషకాహార సేవల అమలుపై వివరాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) రెడ్డి చంద్రిక, ఐసిడిఎస్ పిడి హైమావతి, లీగల్ మెట్రాలజీ, పౌర సరఫరాలు, ఫుడ్ సేఫ్టీ, సాంఘిక సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత గ్రూప్-2 శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**- ఉమ్మడి చిత్తూరు జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు బంగారు అవకాశం**
**- 100 మందికి రెండు నెలల ఉచిత కోచింగ్.. స్టైపెండ్, స్టడీ మెటీరియల్ సైతం అందజేత**
**- జూలై 17 వరకు దరఖాస్తులు.. జూలై 22 నుంచి తరగతుల ప్రారంభం**




**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ శుభవార్త అందించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా గ్రూప్-2 ప్రిలిమ్స్ కోచింగ్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, తిరుపతి సంచాలకులు లిఎం. భరత్ కుమార్ రెడ్డిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి రెండు నెలల పాటు పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు ప్రభుత్వం తరఫున స్టైపెండ్, అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేయనున్నట్లు తెలిపారు. జూలై 22వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయని వివరించారు.

**డిగ్రీ పూర్తి చేసిన వారికి అవకాశం**

డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1 లక్షలోపు ఉండాలని నిబంధనగా వెల్లడించారు.

**జూలై 17లోగా దరఖాస్తులు**

ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జత చేసి జూలై 17వ తేదీలోగా దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

**దరఖాస్తు పంపాల్సిన చిరునామా**

ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, 4-127/2, ఫస్ట్ క్లాస్, శ్రీకృష్ణానగర్, ఎం.ఆర్.పల్లి, తిరుపతి.

**సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు**

అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం లి9441456039, 9346221553, 9490733351లి నంబర్లను సంప్రదించాలని స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం. భరత్ కుమార్ రెడ్డి సూచించారు. గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగ సాధన దిశగా ముందడుగు వేయాలని ఆయన కోరారు.



# పేద ప్రజల గుండె చప్పుడు, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి

**- అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి**

**లక్కిరెడ్డిపల్లె - సూర్య వాస్తవం :** పేద ప్రజల గుండె చప్పుడు, మరుపురాని, మరుపురాని, అభివృద్ధి ప్రదాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైయస్సార్ 77 వ జయంతి సందర్భంగా మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి గ్రామం చాగలగుట్టపల్లి లోని వైఎస్ కాంస్య విగ్రహానికి గజమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి, జోహార్ వైయస్ఆర్, జై జగన్, జై శ్రీకాంత్ రెడ్డి అంటూ నినా దాలు చేసారు. ప్రజలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకా లను ప్రవేశ పెట్టి పేద ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యు లు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షుడు నాగ లక్ష మమ్మా సుబ్బారాయుడు, వైఎస్ఆర్సిపి యూత్ అధ్య క్షులు జగన్నాథ నాయుడు, ఎంపీటీసీలు జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్ నాయుడు,, మాజీ సర్పంచ్ లు రమణయ్య, సిద్దక నాగిరెడ్డి, జనార్దన్ రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి, వెంకటరమణ, దుర్గయ్య, మహేంద్ర బాబు, ఉపసర్పంచ్‌లు సంజీవ రెడ్డి, చిన్నప్ప వైసీపీ నా యకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన వై విశ్వేశ్వరరెడ్డి




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి (వైఎస్సార్) జయంతి సందర్భంగా ఉరవకొండలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. విశ్వేశ్వరరెడ్డి పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేక ప్రజాహిత పథకాలను అమలు చేశారని కొనియాడారు. ముఖ్యంగా జలయజ్ఞం, రైతు రుణమాఫీ వంటి పథకాలు రైతులకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి సి.పి. వీరన్న మాట్లాడుతూ, వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల వల్లే ఆయన నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

# మానవసేవయే మాధవసేవ..

**- అన్నదానం మహాదానం**
**- ఏపీసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి**




**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేముల మండలం నల్ల చెరువుపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ మునీంద్ర కుమార్ రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు బుధవారం వేంపల్లె రాజీవ్ కాలనీలోని అమ్మ అనాధ వృద్ధ శరణాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మానవసేవయే మాధవసేవ పరుల సేవయే పరమాత్ముని సేవ అని పేర్కొన్నారు. ప్రార్థించే పెదవుల కంటే సేవ చేసే చేతులే గొప్పవని, ముఖ్యంగా అనాధలు, వృద్ధులకు సేవ చేయడం అత్యున్నత మానవతా ధర్మమని అన్నారు. వేంపల్లె రాజీవ్ కాలనీలోని అమ్మ అనాధ వృద్ధ శరణాలయాన్ని నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వ సహకారం లేకుండా దాతల సహకారంతో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమానికి దాతలు మరింతగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అన్నదానం మహాదానమని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని పేర్కొన్న తులసి రెడ్డి, స్వర్గీయ మునీంద్ర కుమార్ రెడ్డి సంస్మర ణార్థం ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఆదర్శప్రాయమని అన్నారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా మునీంద్ర కుమార్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమ్మ అనాధ వృద్ధ శరణాలయం నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, మునీంద్ర కుమార్ రెడ్డి తండ్రి రామమునిరెడ్డి, తల్లి సుశీలమ్మ, చెల్లెలు మునికుమారి కృష్ణవేణి, బావ చిన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల ఎగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్నకు రాచమల్లన్న ఘన నివాళి



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** దివంగత నేత డాక్టర్ వై.యస్ రాజ శేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా బుధవారం ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న వై.యస్.ఆర్ విగ్రహానికి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాటా ్లడుతూ పేద ప్రజల గుండెల్లో చిరస్మర ణీయుడు రాజశేఖరన్న అని కొనియాడారు, విద్యార్థులకు దిక్సూచిగా, అన్నం పండించే రైతన్నలకు అండగా, మహిళలకు కుటుంబసభ్యుడిగా, ఆరోగ్య శ్రీ పథకంతో పేద ప్రజలకు దేవుడిగా ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంస్కరణలు అందించి ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ఆపన్న హస్తం అందించిన గొప్ప నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని, ఇలాంటి గొప్ప వ్యక్తి ఎప్పటికీ తెలుగు ప్రజల గుండెల్లో అమరుడే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన వై.యస్.ఆర్.సి.పి నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, గోటూరు వెంకటేష్, మార్తల ఓబుల్ రెడ్డి, మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, ఉప్పర మురళీ, శేఖర్ యాదవ్, మల్లెల ఝాన్సీ, పిట్టా భద్రమ్మ, పార్వతీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# వైఎస్సార్ అమర్ రహే



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** దివంగత నేత డాక్టర్ వై.యస్ రాజశేఖర్ రెడ్డి అమర్ రహే అంటూ వైసిపి నాయకులు నినదించారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా బుధవారం ప్రొద్దుటూరు మునిసిపల్ కార్యాలయం లోని వై.యస్.ఆర్ విగ్రహానికి మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మెన్ పాతకోట బంగారు రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్దన్నగా అందరి బాధ్యత తన భుజాలపై వేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. సి.పి నాయకులు పాతకోట వంశీధర్ రెడ్డి, మాడెం సందీప్, అనీల్ మల్లీఖార్జున యాదవ్, గరిశపాటి లక్ష్మీదేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**- నివాళులర్పించిన వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం నేత వై. ప్రణయ్ రెడ్డి**



**ఉరవకొండ– సూర్య వాస్తవం :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు స్థానికం గా అత్యంత ఘనంగా జరిగాయి. ఆయన ప్రవేశ పెట్టిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల హృద యాల్లో ఎలా నిలిచిపోయాయో ఈ కార్యక్రమం ప్రతిబిం బించింది. వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ వై.ప్రణయ్ రెడ్డి ఆధ్వర్యంలో రాకెట్లలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వైఎస్సార్ జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

**పేదల గుండెల్లో నిలిచిన జననేత వైఎస్ఆర్ : వై. ప్రణయ్ రెడ్డి**

ఈ సందర్భంగా ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిందని, ఫీజ్ రీఇంబర్స్మెంట్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు డాక్టర్, ఇంజనీరింగ్ వంటి ఉన్నత చదువులు చదవగలిగారని కొనియా డారు. రైతులకు, బడుగు బలహీన వర్గాలకు వైఎస్సార్ చేసిన మేలు వల్లే ఆయన ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఉంటారని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం, జననేత కుమారుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడం తమకు గర్వంగా ఉందని స్పష్టం చేశారు.

**మారుమోగిన నినాదాలు**

కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు "జోహార్ వైయస్సార్", "జై జగన్", "జై విశ్వన్న" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ప్రభావం ఇప్పటికీ తెలుగు ప్రజలపై ఎంత బలంగా ఉందో ఈ వేడుకలు మరోసారి నిరూపించాయి.

**వజ్రకరూరులో...** ఉరవకొండ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పీఏసీ మెంబర్ వై. విశ్వేశ్వర్ రెడ్డి, వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై. ప్రణయ్ కుమార్ రెడ్డి ల ఆదేశాల మేరకు.. నేడు వజ్రకరూరు మండల కేంద్రంలో స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ?వజ్రకరూరు మండల అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన నివాళులర్పించారు. ?మండల కేంద్రంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వైఎస్సార్ 77వ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ హయాంలో జరిగిన సంక్షేమ పాలనను, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని నాయకులు కొనియాడారు.?ఈ కార్యక్రమంలో దేవి (ఎంపీపీ)డిష్ సురేష్ (బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు) ఉస్మాన్ (మండల ఉపాధ్యక్షుడు) బోయ సుశీలమ్మ (మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్) వీరితో పాటు మండలంలోని మాజీ సర్పంచ్లు, అనుబంధ సంఘాల లీడర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతి నిధులు వైఎస్సార్సీపీ కార్యకర్తలు, వైఎస్సార్ అభిమా నులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**పామిడిలో...** స్థానిక పట్టణంలోని వైఎస్సార్సీపీ గుంతకల్ ఇన్చార్జి వై.వెంకట్రామిరెడ్డి ఆదేశానుసారంగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకేశవరెడ్డి మండల కన్వీనర్ రూరల్ కన్వీనర్ ఆధ్వర్యంలో మరపురాని మహానేత దివంగత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజ శేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలను ఘనంగా పామిడి పట్టణంలో నిర్వ హించారు. వైయస్సార్ విగ్రహానికి ముందుగా పాలాభి షేకం చేసి వైయస్సార్ అభిమానుల సమక్షంలో మరపు రాని మహానేతకు పూలమాలలు వేసి ఘనంగా నిర్వ హిం చారు.

ఈ సందర్భంగ నాయకులు మాట్లాడుతూ అనంతరం ఆయన ప్రజా సంక్షేమ పాలన, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను నాయకులు స్మరించుకున్నారు. వైఎస్ ఆశయాల సాధనకు కట్టుబడి పని చేస్తామని, ప్రజా సేవే తమ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









# వైఎస్సార్ ఆశయాలు చిరస్థాయిగా నిలవాలి

**- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి**



**తాడిపత్రి– సూర్య వాస్తవం :** దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలను తాడిపత్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళు లర్పిం చారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరియు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత వైఎస్సార్ ఆశ యాలు చిరస్థాయిగా నిలవాలని, ఆయన చూపిన బాటలోనే మనమంతా పయనిం చా లని కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్సార్కు మరణం లేదు..

**- కోట్లాది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు**

**- ఇడుపులపాయ ఘాట్లో మహానేతకు ఘన నివాళులు..**

**- 77వ జయంతి సందర్భంగా షర్మిల భావోద్వేగ ప్రసంగం**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన సమాధికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల,వైఎస్ విజయమ్మతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. సమాధిపై పుష్పాంజలి ఘటించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇడుపులపాయకు చేరుకుని మహానేతకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన షర్మిల.. వైఎస్సార్ కుటుంబం అంటే కేవలం తమ కుటుంబం మాత్రమే కాదని, కోట్లాది మంది ప్రజలతో కూడిన పెద్ద కుటుంబమని అన్నారు. వైఎస్సార్ ప్రజలకు చేసిన మేలును ఈ రోజుకీ ప్రజలు ప్రేమతో స్మరించుకుంటు న్నారని పేర్కొన్నారు. ముఖ్య మంత్రిగా కేవలం ఐదేళ్లే పనిచేసినా, ఆ ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని ప్రతి గడపకు చేరాయని తెలిపారు. వైఎస్సార్ మరణవార్తను తట్టుకోలేక వందలాది మంది అభిమానులు ప్రాణత్యాగం చేశారని, అది ఆయనపై ప్రజలకు ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, జల యజ్ఞం వంటి పథకాలతో పాటు, పేదల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి విప్లవా త్మక పథకాలను వైఎస్సార్ అమలు చేశారని షర్మిల గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య ను అభ్యసించి డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదిగారని, ఆరోగ్యశ్రీ పథకం ఎందరో పేద కు టుంబాలకు ప్రాణాధారంగా నిలిచిందన్నారు.వైఎస్సార్ ఒక లెజెండరీ నాయ కుడని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేతకు మరణం లేదని షర్మిల అన్నారు. వైఎస్సార్ను ఇప్పటికీ ప్రేమతో స్మరి స్తున్న కోట్లాది తెలుగు ప్రజ లకు రాజశేఖర్ రెడ్డి కుటుంబం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోట్లాది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్

**- ఘనంగా ఇడుపులపాయ ఘాట్లో 77వ జయంతి వేడుకలు**

**- నివాళులర్పించిన వైఎస్ జగన్, కుటుంబ సభ్యులు**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ ఘాట్కు చేరుకుని పూలమాలలు ఉంచి మహానేతకు అంజలి ఘటించారు. అనంతరం మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ జగన్, శ్రీమతి వైఎస్ విజయమ్మ, శ్రీమతి వైఎస్ భారతి తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా నేత వైఎస్సార్ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, ఉచిత వైద్య సేవలు, విద్యా అవకాశాల విస్తరణ, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిలో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన నాయ కుడిగా వైఎస్సార్ కోట్లాది ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపా దించుకున్నారని కొనియాడారు. మహానేత ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు.ఈ కార్య క్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని వైఎస్సార్ ఘాట్ వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంత వాతావరణంలో జరిగింది.

# వైఎస్ షర్మిలా రెడ్డితో కలిసి నివాళులర్పించిన ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా బుధవారం ఇడుపులపాయ లోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి వైఎస్సార్ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పిం చారు. ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, అభివృద్ధి కార్యక్రమాల కోసం డాక్టర్ వైఎస్ రాజ శేఖరరెడ్డి అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా నాయ కులు స్మరించుకు న్నారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొ న్నారు. అనం తరం వైఎస్సార్ జయంతి సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు